నమ్మలేని నిజాలు

ఆరోగ్య బీమా
జనతా మహాభాగ్యం
ప్రభుత్వ లక్ష్యం.
నేటి మనిషి
ఏ ఎండకాగొడుగు
పతన కాలం.
నీటి ఆటలు
మోటబాయి ఈతలు
నీరైన ఎండ.
ఆరోగ్య మస్తు
కడుపు కాలి పస్తు
పైసల సుస్తు.
ర్యాంకుల వేట
కోచింగ్ సెంటర్ల బాట
ఆటకు టాటా.

- రేడియమ్
సెల్: 9291527757

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

శ్రీనిజాలు

దివ్యాంగులారా మీకు
యాభై నాల్గుయేళ్లలోపు !
సర్కార్ కొలువు కావాల
ఉండాలోయ్ ఎదురుచూపు !
నియామకాలకు గరిష్ట
వయోపరిమితిలో పెంపు !
ఇక నియామకం విరమణ
ఒకేరోజు పెడితె సొంపు !

- కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

హైదరాబాద్ గురువారం 21-5-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:222 పేజీలు:6 వెల: రూ.1/-

## చంద్రయాన్-3 మరో సంచలనం.. విక్రమ్ ల్యాండర్ కీలక ఆవిష్కరణ..

హైదరాబాద్, మే 20:ఇస్రో చేపట్టిన చంద్రయాన్-3 మిషన్ మరో కీలక శాస్త్రీయ ఆవిష్కరణకు దారితీసింది. విక్రమ్ ల్యాండర్ చేసిన చిన్న 'హాప్ ఎక్స్‌పెరిమెంట్' చంద్రుడి దక్షిణ ధృవ ప్రాంత ఉపరితలం గురించి కొత్త వివరాలను బయటపెట్టింది. మిగిలిపోయిన ఇంధనాన్ని ఉపయోగించుకోవాలనే అనూహ్య నిర్ణయంతో ఈ ప్రయోగం చేపట్టారు. చంద్రుడిపై శివశక్తి పాయింట్ వద్ద ఉన్న నేల గతంలో భావించిన దానికంటే చాలా వైవిధ్యమైనదని, సంక్లిష్టమైనదని వెల్లడించే ఒక మైలురాయిగా ఈ ప్రయోగం నిలిచింది

ఈ ప్రయోగంలో ల్యాండర్ సుమారు 40 నుంచి 50 సెంటీమీటర్ల పైకి ఎగిరి, కొద్దిదూరం పక్కకు వెళ్లి మళ్లీ సాఫ్ట్‌గా ల్యాండ్ అయింది. ఈ ప్రయోగం వల్ల చంద్రుడి ఉపరితలంపై ఉన్న పై పొర తొలగిపోయి, లోపలి మట్టిని చంద్ర సర్ఫేస్ థర్మోఫిజికల్ ఎక్స్‌పెరిమెంట్ పరికరం పరిశీలించే అవకాశం లభించింది. దీంతో చంద్రుడి మట్టి ఒకేలా కాకుండా పలు పొరలుగా ఉందని శాస్త్రవేత్తలు గుర్తించారు. పైభాగం పొర చాలా మెత్తగా ఉండగా, కింద భాగం మరింత ఘనంగా ఉందని అధ్యయనం తెలిపింది

ఈ సమాచారం భవిష్యత్ చంద్ర మిషన్లకు చాలా కీలకంగా మారనుంది ముఖ్యంగా నాసా ఆర్టెమిస్ మిషన్ ద్వారా చంద్రుడిపై శాశ్వత స్థావరం ఏర్పాటు చేయాలనే ప్రణాళికలకు ఈ డేటా ఉపయోగపడనుందని నిపుణులు చెబుతున్నారు. 2023 జూలై 14న ప్రయోగించిన చంద్రయాన్ 3, చంద్రుని దక్షిణ ధృవం ఉపరితలంపై సురక్షితంగా ల్యాండ్ అయి ప్రపంచాన్ని అబ్బురపరిచింది. చంద్రుడి దక్షిణ ధృవంపై అడుగుపెట్టిన మొట్ట మొదటి దేశంగా భారత్ నిలిచింది.

## అసాంఘిక చర్యల నియంత్రణ కోసం కార్డన్‌సెర్చ్.. హుజూరాబాద్ టౌన్ సీఐ కరుణాకర్

హైదరాబాద్, మే 20: సమాజంలో అసాంఘిక చర్యల నియంత్రణ కోసమే గ్రామాల్లో కార్డన్‌సెర్చ్ నిర్వహిస్తున్నట్లు హుజూరాబాద్ టౌన్ సీఐ కరుణాకర్ అన్నారు. వీణవంక మండలంలోని కోర్కల్ గ్రామంలో బుధవారం తెల్లవారుజామున సీపీ గౌస్ ఆలాం ఆదేశాల మేరకు హుజూరాబాద్ టౌన్ సీఐ ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని 50 ద్విచక్ర వాహనాలు, 7 ఫోర్ వీల్, ఒక ఇసుక ట్రాక్టర్ పట్టుకొని, సరైన ధృవపత్రాలు లేని వారికి జరిమానా విధించినట్లు తెలిపారు.

అనంతరం సీఐ కరుణాకర్ మాట్లాడుతూ వాహనాలు నడిపే ప్రతీ ఒక్కరికీ లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలని, వాహనాలకు ఇన్సూరెన్స్‌తో పాటు సరైన ధృవపత్రాలు ఉండాలని అన్నారు. మైనర్లు వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లో అపరిచితులు కనబడితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, వేసవికాలంలో దొంగతనాలకు ఆస్కారం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట రూరల్ సీఐ పులి వెంకట్, వీణవంక ఎస్ఐ ఆవుల తిరుపతి, శంకరపట్నం ఎస్ఐ శేఖర్‌రెడ్డి, సర్పంచ్ పూదరి రమ్యకృష్ణ-అనిల్, 50 మంది పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టులకు ఇళ్ళు, ఇళ్ళ స్థలాలు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నందున అర్హులైన చిన్న దినపత్రికల సంపాదకులకు కూడా ఇళ్ళ స్థలాలు ఇచ్చేలా చూడాలని మీడియా అకాడమీ చైర్మన్ శ్రీ కె. శ్రీనివాస రెడ్డి గారికి తెలంగాణ స్మాల్, మీడియం న్యూస్ పేపర్స్ మరియు మేగజైన్స్ అసోసియేషన్ తరపున వినతి పత్రం సమర్పిస్తున్న మహ్మద్ ఖాన్, వై. అశోక్, యూసుఫ్‌బాబు.

## భారీగా ఎండలు.. తెలంగాణ ప్రజలకు సీఎం రేవంత్ కీలక సూచనలు..

హైదరాబాద్, మే 20:తెలంగాణలో ఎండల తీవ్రతపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అప్రమత్తమయ్యారు. ఎండల దృష్ట్యా ప్రభుత్వ యంత్రాంగాన్ని, రాష్ట్ర ప్రజలను ఆయన అలర్ట్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉత్తర తెలంగాణ జిల్లాలకు వాతావరణ శాఖ ప్రత్యేక హెచ్చరికలు కూడా జారీ చేసింది. దీంతో అధికారులు, రాష్ట్ర ప్రజలను సీఎం రేవంత్ రెడ్డి అప్రమత్తం చేశారు. ఈ మేరకు కలెక్టర్లకు దిశానిర్దేశం చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఆదేశాలు జారీ చేశారు.

ఎండల తీవ్రత నేపథ్యంలో ప్రజలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని సీఎం రేవంత్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. తాగునీరు, విద్యుత్ సరఫరాపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆజ్ఞాపించారు. అలాగే ఆస్పత్రుల్లో వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, వడ దెబ్బ బాధితులకు వెంటనే మెరుగైన చికిత్స అందించాలని సూచించారు. మరోవైపు పట్టణాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు సీఎం. మధ్యాహ్నం వేళ ప్రయాణాలు తగ్గించాలని రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు, వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో తగిన చర్యలు చేపట్టేందుకు ప్రభుత్వ యంత్రాంగం సిద్ధమైంది.

## ఫ్యూచర్ సిటీ డిజైన్స్‌పై సీఎం రేవంత్ రెడ్డి సూచనలు

హైదరాబాద్, మే 20: పరిశ్రమల శాఖపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎమ్‌సీహెచ్‌ఆర్‌డీలో సమీక్ష నిర్వహించారు. భారత్ ఫ్యూచర్ సిటీలో ల్యాండ్ అలాట్మెంట్, పరిశ్రమల ఏర్పాటుపై చర్చించారు. నెట్ జీరో సిటీ తరహాలోనే ఫ్యూచర్ సిటీ డిజైన్స్ ఉండాలని సీఎం తెలిపారు. మౌలిక వసతుల కల్పన అంతర్జాతీయ స్థాయిలో ఉండాలని.. ఇందులో రాజీ పడొద్దని స్పష్టం చేశారు. అంతర్జాతీయ స్థాయి నగరాలను అధ్యయనం చేయాలని.. ట్రంక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధి చేసిన తర్వాతే భూ కేటాయింపులు చేయాలని సూచించారు. అంతర్జాతీయ స్థాయి సంస్థలను ఫ్యూచర్ సిటీకి తీసుకురావాలని సీఎం అన్నారు.

ఫ్యూచర్ సిటీలో ప్రజా ప్రతినిధులు, సివిల్ సర్వీస్ అధికారులు, జర్నలిస్ట్‌లకు 500 ఎకరాలు కేటాయించాలని సీఎం తెలిపారు. కేంద్రం ప్రకటించిన హెల్త్ క్లస్టర్‌ను ఫ్యూచర్ సిటీకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అవసరమైతే ప్రధాని మోదీని కలిసి హెల్త్ క్లస్టర్ కేటాయించాలని విజ్ఞప్తి చేద్దామని ముఖ్యమంత్రి అన్నారు. జూన్‌లో ఫ్యూచర్ సిటీ ఇండస్ట్రియల్ పార్క్‌లో పరిశ్రమల ఏర్పాటుకు శంకుస్థాపన జరిగేలా చూడాలన్నారు. భూ కేటాయింపు జరిగిన వెంటనే పరిశ్రమలు నిర్మాణం మొదలు పెట్టేలా నిబంధన విధించాలని తెలిపారు. ఇన్వెస్ట్ తెలంగాణ పేరుతో పెట్టుబడుల ఆకర్షణకు ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఇన్వెస్ట్ తెలంగాణ కోసం ఆకర్షణీయమైన లోగో, వెబ్ సైట్ రూపొందించాలని వెల్లడించారు. ఇన్వెస్ట్ తెలంగాణ కోసం ప్రత్యేక కార్యాలయం ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టే వారి కోసం ఎస్కార్ట్ ఆఫీసర్ వ్యవస్థను రూపొందించాలని సీఎం ఆదేశించారు. గ్రూప్ 1 స్థాయి అధికారిని ఎస్కార్ట్ ఆఫీసర్‌గా నియమించే అంశాన్ని పరిశీలించాలని తెలిపారు. తమిళనాడు, గుజరాత్ పారిశ్రామిక విధానాన్ని అధ్యయనం చేయాలన్నారు. బుల్లెట్ ట్రైన్ కోసం భూ సేకరణ ప్రారంభించాలని ఆదేశించారు. 1500 ఎకరాల్లో డేటా సిటీ ఏర్పాటు చేయాలని.. డేటా సిటీ నీటి అవసరాల కోసం ఎస్‌టీపీలను వినియోగించాలని సూచనలు చేశారు. జీసీసీలు, డేటా సెంటర్ల కోసం కరీంనగర్, వరంగల్, విజయవాడ రోడ్ల సమీపంలో ఉ



న్న ప్రభుత్వ భూములు గుర్తించాలని ఆదేశించారు. ద్వితీయ శ్రేణి నగరాలల్లో జీసీసీ ఏర్పాటు పైనా దృష్టి పెట్టేలా పాలసీ రూపకల్పన చేయాలన్నారు. మూడు నెలల్లో ప్రభుత్వ కార్యాలయాలు.. టీ ఫైబర్‌కు కనెక్ట్ కావాల్సిందే అని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశానికి పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ వైస్ చైర్మన్ శశాంక, పరిశ్రమల శాఖ కమిషనర్ నిఖిల్ చక్రవర్తి, ఐటీ శాఖ జాయింట్ సెక్రటరీ అనుదీప్ దురిశెట్టి, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## శంషాబాద్ విమానాశ్రయంలో పట్టుబడిన హైగ్రేడ్ గంజాయి..

హైదరాబాద్, మే 20: శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో హైగ్రేడ్ గంజాయి భారీగా పట్టుపడింది. బ్యాంకాక్ నుంచి హైదరాబాద్‌కు వచ్చిన ఇద్దరు ప్రయాణికుల వద్ద గంజాయిని డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్(డీఆర్ఐ) అధికారులు గుర్తించారు. నిందితులు విమానం దిగిన వెంటనే డీఆర్ఐ అధికారులకు అనుమానాస్పదంగా కనిపించారు. దీంతో వారిని నిలువరించి లగేజీ తనిఖీ చేయగా గంజాయి బయటపడింది. నిందితులు అత్యంత చాకచక్యంగా వాటర్ బాటిల్స్, స్నాక్ టిన్స్, ఫుడ్ బాక్సుల్లో హైగ్రేడ్ గంజాయిని ప్యాక్ చేసి స్మగ్లింగ్‌కు ప్రయత్నించారు.

మొత్తం 8.705 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు డీఆర్ఐ అధికారులు తెలిపారు. అంతర్జాతీయ మార్కెట్‌లో దీని విలువ సుమారు రూ.3.05 కోట్ల వరకు ఉంటుందని అంచనా వేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన డీఆర్ఐ అధికారులు.. ఇద్దరు నిందితులను ఎన్‌డీపీఎస్ చట్టం కింద అరెస్ట్ చేశారు. ఈ స్మగ్లింగ్ వెనుక ఉన్న డ్రగ్స్ నెట్‌వర్క్, ఇతర సంబంధాలపైనా మరింత లోతుగా దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు. శంషాబాద్ విమానాశ్రయంలో ఇటీవల గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలు, బంగారం వంటి విలువైన వస్తువులు తరలిస్తూ స్మగ్లర్లు భారీగా పట్టుపడుతున్నారు.

## కులగణనపై సీజేఐ ధర్మాసనం కీలక తీర్పు

న్యూఢిల్లీ, మే 20: కులగణనపై సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. జనగణనలో కులాల లెక్కింపునకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్‌తో కూడిన ధర్మాసనం అనుమతి ఇచ్చింది. కులగణనను వ్యతిరేకిస్తూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని ధర్మాసనం కొట్టివేసింది. ఈ మేరకు బుధవారం జస్టిస్ సూర్యకాంత్‌తో కూడిన ధర్మాసనం తీర్పు వెలువరించారు.

సంక్షేమ పథకాల అమలుకు కులగణన తప్పనిసరి అని స్పష్టం చేసింది. కుల గణన ప్రభుత్వ విధానపరమైన నిర్ణయమని పేర్కొంది. ఈ అంశంలో కోర్టుల జోక్యం ఉండదని స్పష్టం చేసింది. జన గణన.. కుల ప్రాతిపదికన జరగాలా వద్దా అనేది విధాన పరమైన నిర్ణయమని పేర్కొంది. వెనుకబడిన తరగతికి చెందిన వారు ఎంతమంది ఉన్నారో ప్రభుత్వం తెలుసుకోవాల్సి ఉందని ఈ ధర్మాసనం వ్యాఖ్యానించింది.

## కేరళ కేబినెట్ మంత్రులకు శాఖల కేటాయింపు..

తిరువనంతపురం, మే 13: కేరళలో కొత్తగా ఏర్పాటైన యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (యూడీఎఫ్) ప్రభుత్వం క్యాబినెట్ మంత్రులకు శాఖలను కేటాయించింది. ముఖ్యమంత్రి వి.డి.సతీశన్ ఆర్థిక, న్యాయ, సాధారణ పరిపాలన, ఓడరేవుల వంటి ప్రధాన శాఖలను తన వద్దే ఉంచుకున్నారు. సీనియర్ కాంగ్రెస్ నాయకుడు రమేశ్ చెన్నితాలకు కీలకమైన హోంశాఖ, విజిలెన్స్ శాఖలతో పాటు మరో మూడు శాఖలను కేటాయించారు.

ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (ఐయూఎంఎల్)కు చెందిన పి.కె.కున్హాలికుట్టికి పరిశ్రమలు, సమాచార సాంకేతికత, వస్త్ర పరిశ్రమలు సహా ఏడు శాఖలను అప్పగించారు. కేరళ కాంగ్రెస్ అధ్యక్షుడు సన్నీ జోసెఫ్‌కు విద్యుత్, పర్యావరణ శాఖలను కేటాయించగా.. సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కె.మురళీధరన్‌కు ఆరోగ్య, దేవస్వం శాఖలను ఇచ్చారు. రోజి ఎం.జాన్‌కు ఉన్నత విద్యా శాఖను అప్పగించగా.. ఎ.పి.అనిల్ కుమార్‌కు ల్యాండ్, రెవెన్యూ శాఖలను అప్పగించారు.

ఇక, రివల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ ఎమ్మెల్యే శిబు బేబీ జాన్‌కు అటవీ, వన్యప్రాణుల సంరక్షణ, నైపుణ్యాభివృద్ధి శాఖలను కేటాయించారు. అలాగే నీటిపారుదల, భూగర్భ జలాలు, నీటి సరఫరా, పారిశుద్ధ్యం, గృహనిర్మాణ శాఖలను కేరళ కాంగ్రెస్ (జోసెఫ్) శాసనసభ్యుడు మోన్స్ జోసెఫ్‌కు అప్పగించారు.

## హేతువాద దృష్టితో పౌరాణిక రచనలు చేసిన చలం!



సభకు ఆహ్వానం పలుకుతున్న డా॥నాళేశ్వరం శంకరం. ● చలంకు నివాళి అర్పిస్తున్న బెల్లంకొండ సంపత్‌కుమార్ డా॥ ఏనుగు నరసింహారెడ్డి , డా॥నాళేశ్వరం శంకరం, వేణుగోపాల్, కుప్పిలి పద్మ, ఐనంపూడి శ్రీలక్ష్మి, బండారు విజయ, అరుణ ధూళిపాళ, గడ్డం సులోచన, శీలా సుభద్రాదేవి, డా॥ నందిని సిధారెడ్డి, నేటినిజం సంపాదకులు బైస దేవదాసు.● సభలో ప్రసంగిస్తున్న ప్రధాన వక్త ఎన్.వేణుగోపాల్, డా॥ ఏనుగు నరసింహారెడ్డి, కుప్పిలి పద్మ, ఐనంపూడి శ్రీలక్ష్మి, అరుణ ధూళిపాళ, బండారు విజయ.

హైదరాబాద్, మే 20(నేటినిజం ప్రతినిధి)పురాణ పాత్రలను స్వీకరించి సమాజానికి అర్థమయ్యే విధంగా పౌరాణికాలలో తనలోని సరికొత్త భావాలను ప్రవేశపెట్టి రాసిందే చలం పౌరాణిక సాహిత్యం. ఆయన రాసిన పౌరాణిక నాటికలు, నాటకాలు సమాజానికి సరికొత్త ఆలోచనలు అందిస్తాయి. ఈ పౌరాణికాలకు నేటికీ రిలవెన్స్ ఉందని ఎన్.వేణుగోపాల్ 'జీవజలం చలం' స్మారకోపన్యాసం చేస్తూ అన్నారు. రవీంద్రభారతిలో 'జీవజలం చలం' సాహిత్య స్మారకోపన్యాసం సభలో ప్రధానవక్తగా ఎన్.వేణుగోపాల్ ప్రసంగిస్తూ పౌరాణిక కథలు పాతవే. పాత్రలు పాతవే. అందరికీ తెలిసిన ఇతివృత్తాలలో నూతన భావాలను ప్రవేశపెట్టడం మాత్రం కొత్తదన్నారు.

సాంస్కృతిక శాఖ సంచాలకులు డా॥ ఏనుగు నరసింహారెడ్డి మాట్లాడుతూ పౌరాణికాలలో చలం ఆధునిక భావాలను ప్రవేశపెట్టిన రచయిత చలం. అనేక విమర్శలు ఎదుర్కొన్న రచయిత చలం అన్నారు. సభకు అధ్యక్షత వహించిన డా॥నాళేశ్వరం శంకరం మాట్లాడుతూ చలం రాసిన నలభై నాటకాలలో పౌరాణికాలు పది. హరిశ్చంద్ర, శశాంక, నరసింహావతారం, పురూనవ,.. సావిత్రి, భానుమతి, ద్రౌపది వంటి నాటికలు నాటకాలు సంస్కృత నాటకకర్తలైన భాసుడు, కాళిదాసు వంటి ఎందరో సంస్కృత నాటకకర్తలు రామాయణ, భారత కథలు ఇతివృత్తాలు తీసుకుని రాశారు. అలాగే తెలుగులోను ఎందరో పౌరాణిక నాటకాలు రాశారు. చలం వారికి భిన్నంగా హేతుదృష్టితో తెలిసిన పౌరాణిక పాత్రలలో తనవైన నూతన భావాలను ప్రవేశపెట్టి రాశారన్నారు.

కుప్పిలి పద్మ చలం పౌరాణిక సాహిత్యంపై ప్రసంగిస్తూ చలం భావుకత గొప్పది. పురుషులు మారనంత కాలం సమాజం మారదు. సమాజం మారనంత కాలం చలం రచనలు జీవిస్తాయని అన్నారు.

సీత అగ్ని ప్రవేశం, పురూరవ, భానుమతి, ద్రౌపది నాటక, నాటికలలోని కొన్ని కొన్ని భాగాలను భండారు విజయ, అరుణ ధూళిపాళ, డా॥ ఐనంపూడి శ్రీలక్ష్మి, గడ్డం సులోచన సభికులు ఆలోచించే విధంగా చలం పౌరాణికాలలోని కొన్ని భాగాలను వినిపించారు.

జీవచలం చలం ఛాయాచిత్ర పటానికి ఇటీవల కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు పొందిన డా॥నందిని సిధారెడ్డి, ప్రముఖ రచయిత్రి, శీలా సుభద్రాదేవి, నేటినిజం సంపాదకులు బైస దేవదాసు, ఎన్. వేణుగోపాల్, డా॥ ఏనుగు నరసింహారెడ్డి, ఐనంపూడి శ్రీలక్ష్మి, డా॥నాళేశ్వరం శంకరం తదితరులు పూలతో ఘనంగా నివాళి అర్పించారు.

డా॥బెల్లంకొండ సంపత్‌కుమార్ స్వాగతం, వందన సమర్పణ చేశారు. నగరంలో ఉన్న ప్రసిద్ధ కవులు, రచయితలు, విమర్శకులు, చలం అభిమానులతో సభ నిండుగా సాగింది.

నేటినిజం
# సాహితీ కెరటాలు
website: www.netinijam.com

2 హైదరాబాద్ | ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 | గురువారం 21-5-2026

## సప్త పదులు

ప్రక్రియా సృజనకర్త: సుధామ



**చ**రితం
త్వరితం
నచ్చినవారు
పలకరిస్తే
మనసంతా
ఆనంద భరితం.
-ద్విభాష్యం నాగలక్ష్మి, అనకాపల్లి

**త**నువు
మనువు
ఆలుమగల
మధ్య
అర్థం చేసుకునే
చనువు.
-పంతులలలిత విశాఖపట్నం..

**స్వ**భావాలు
ప్రభావాలు
సంతృప్తి,
పరోపకారం,
భూతదయ వంటివి
సానుకూలభావాలు.
-కె. ఎం. కె. మూర్తి, సికింద్రాబాద్

**వె**తకాలి
బతకాలి
దురాశకు
పోకుండా
మినీగ కలిగినంత
కతకాలి
-రాజకుమార్ యస్. రుద్రపాటి, విశాఖపట్నం

**వ**దనం
సదనం
ఆనందాల
నిలయమైన ఇల్లే
ఒక
నందనం
-సరోజ రెబ్బాప్రగడ, బెంగళూరు

**క**దలదు
మెదలదు
మనసు
మాయలాడి
గతాన్ని పట్టుకుంటే
వదలదు....!!
-శ్రీమతి భారతీకృష్ణ హైదరాబాద్

## సాహిత్యానికి సంగీతం తోడైతే... హృదయానికి చేరుతుంది

**-పద్మభూషణ్ డా॥ కె.ఐ.వరప్రసాద్‌రెడ్డి**



డా॥ఎం.కె.రాముని సత్కరిస్తున్న అతిథులు ఆచార్య కొలకలూరి ఇనాక్, డా॥కె.ఐ.వరప్రసాద్‌రెడ్డి, డా॥ ఆశాలత, డా॥సముద్రాల వేణుగోపాలాచారి తదితరులు

మంచి అంశంతో సాహిత్యం రాస్తే దీనికి సంగీతం తోడైతే, హృదయానికి చేరుతుందని శాంత బయోటెక్ అధినేత పద్మ భూషణ్ డాక్టర్ కెఐ. వరప్రసాదరెడ్డి అన్నారు. తెలుగు విశ్వవిద్యాలయంలో ఎన్‌టీఆర్ కళా పాటు జరిగిన డాక్టర్ రాము లలిత గీతాల పటాభిషేకం ముగింపు సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాములో మంచి భావోద్వేగం ఉందన్నారు. లలిత గీతం జానపద గీతాలకు మారుగా వచ్చిందన్నారు. దాని నుంచి సినిమా పాట వచ్చిందన్నారు. సినీ పాటకు పరిధి ఉంటుంది కానీ లలిత గీతా నికి అలాంటి అంటూ ఏవీ ఉండవని చెప్పారు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం పూర్వ ఉప కులపతి ఆచార్య కొలకలూరి ఇనాక్, ప్రముఖ సినీ సంగీత దర్శకుడు సాలూరి వాసురావు మాట్లాడుతూ రాము రచించిన 216 లలిత గీత గానం సంగీత చరిత్రలో రికార్డ్ అని కొనియాడారు. సాహితీవేత్త డాక్టర్ చెన్నకేశ వరెడ్డి, ప్రఖ్యాత సంగీత దర్శకుడు పి.వి. సాయిబాబా, డా॥సముద్రాల వేణుగోపాలా చారి తదితరులు పాల్గొన్న వేదికపై రాముకు సత్కారం చేశారు. ఆశాలత వ్యాఖ్యానంలో రామాచారి నిర్వహణలో 108 లలిత గీతాలు ఉదయం నుంచి రాత్రి వరకు నిర్విరామంగా గానం చేశారు.

## నేలపాలు


పాలు
అమృతం పర్యాయరూపం.
దేవతల దాహార్తి తీర్చేది.
దివిలో అమృతం.
భువిలో క్షీరామృతం.
పాడి ఉన్న ఇల్లు
పది కాలాలు వర్ధిల్లు.
ఇంటి ఆరోగ్య సూచిక .
ఏం లేకున్నా
ఇన్ని పాలు ఉంటే చాలు.
పూట ఇట్టే గడిచిపోతుంది.
తోడై ఇంటిల్లిపాదిని బతికిస్తుంది.
పసిపాప మొదలు పండు ముదుసలి వరకు
ఇన్ని పాలకై తహతహ లాడుతుంటారు.
అది పెరుగుగా, చల్లగా, వెన్నగా
రూపం ఏదైతేనేం!
జిహ్వ చాపల్యం తీర్చడానికి.
నాలుగు పశువులు ఉన్న ఇల్లును
నాలుగు కాలాలు బతికిస్తుంది పాడి.
పసి బిడ్డల ' పెరుగు' దలకు
పెరుగు ఓ చక్కని ఔషధం.
'టీ 'రూపంలో
ఇంటి మర్యాదనూ కాపాడుతుంది.
ఎండలో పడి వచ్చిన వాళ్లను
'చల్ల ' పరుస్తోంది చల్ల.
అయ్యా నాయకులారా!
పాలను అభిషేకం పేరిట
నేలపాలు చేయకండి.
ఆవు ఆరాధ్య దైవం.
తల్లికి మారు రూపం.
ఎంత రక్తం పిండితే
ఆ నాలుగు చుక్కలు పాలౌతాయో!
మీ పథకాలు మీకు ఉండొచ్చు!
మీ మైలేజీ మీకు ఉండొచ్చు!
పాలను పరిహాసం చేయకండి.
పాలతో శుద్ధి వస్తుందా!
పాలనతో రావాలి.
పరి'పాల'నతోనే ప్రగతి.
పాలు ఎప్పుడూ
నేలపాలు కావొద్దు.
మంచికి ఎపుడూ
మనసులోనే పాలాభిషేకం చేద్దాం.
బాబ్బాబు
జర దయునీచండి.
బుడ్డోడు పాలకై ఒసఒస లాడుతుండు.
వాడి నోటికాడి పాలసీసాను తీసెయ్యకండి.
పాలప్యాకెట్లను ఫ్లెక్సీల పాలు చేయకండి.
పాలకుడా!
జర పాలకుండ భద్రం.



**- డా॥పోరెడ్డి రంగయ్య**
సెల్:9948049864

## సామాజిక చైతన్య కాంక్ష - చలనకాంక్ష







ప్రతులకు:మౌనశ్రీ మల్లిక్
ఇంటి నెం. 1-10-28/232/4/2, కవి మౌనశ్రీ వీధి, లేన్ నెం. 6, శివసాయి నగర్, కుషాయిగూడ, ECIL పోస్ట్, హైదరాబాద్- 62.
మొబైల్: 8919338546

**వ**ర్తమాన తెలుగు కవిత్వంలో తాత్వి కతను, సామాజిక స్పృహను మేళవించి రాసే కవులు అరుదు. అందులో ముందు వరుసలో నిలిచేకవి మౌనశ్రీ మల్లిక్. తన కలం నుండి జాలువారిన తాజా కవితా సంపుటి 'చలనకాంక్ష'.

**"జీవితంలో కవిత్వం వరించడం ఉత్సవం!**
**కవిత్వంలో జీవితం తరించడం ఉద్యమం!!"**

మకుటంతో ప్రారంభమయ్యే కవిత్వం, నిశ్చల వ్యవస్థను కదిలిస్తూ ఆశావహ దృక్పథం వైపు నడిపిస్తుంది.

ఈ పుస్తకం మొదట్లో మనకు కవిలోని కృతజ్ఞతా భావం కనిపిస్తుంది. తన ఆత్మీయ మిత్రుడు దేవానంద్ నాగెల్లకు ఈ సంపుటిని అంకితం ఇచ్చారు. ఎటు వంటి ఆర్భాటం లేకుండా లోతైన ఆలోచనను పలికించే 'చలన కాంక్ష', కేవలం కవితల పుస్తకం మాత్రమే కాదు. ఇది ధోరణికి ఈ పుస్తకం ఒక ముఖ్యమైన అడుగు అని చెప్పవచ్చు. ఇది కవిత్వాన్ని ప్రేమించే పాఠకులకు మాత్రమే కాకుండా, జీవితం గురిం చి ప్రశ్నలు వేసుకునే ప్రతి ఒక్కరికీ దగ్గరగా ఉంటుంది.

నేటి తెలుగు కవిత్వంలో మౌనశ్రీ మల్లిక్ కవిత్వం ప్రత్యేక స్థానం సంపాదిం చుకుంది. ఈ పుస్తకం ఆయనను మరో మెట్టు ఎక్కించింది. ఈ సంపుటిలో కవి కేవలం ప్రకృతి సౌందర్యానికో, వ్యక్తిగత వేదనకో పరిమితం కాలేదు. సమాజంలోని అసమానతలను, అణగారిన వర్గాల ఆర్తనాదాలను శక్తిమంతంగా అక్షరీకరించారు.

'వధ్య భారతం' కవితలో అడవి బిడ్డల ఆవేదనను కళ్లకు కట్టారు.

**"తుపాకుల మోతలకు పక్షులు వలసపోతున్నాయి / అమ్మ ఒడిలో పాలు తాగుతున్న పసిపిల్లల తలల్లో బుల్లెట్లు దిగుతున్నాయి".**

అడవి ఎవరిది? అన్న ప్రశ్నను సంధిస్తూ, అది ఆదివాసుల మూలధనం అని చాటిచెప్పారు.

అమ్మకు అక్షర నీరాజనం:

**'అమ్మ నా ఆదికావ్యం'** కవితలో అమ్మ పడ్డ శ్రమను, ఆమె త్యాగాన్ని హృదయవిదారకంగా చిత్రించారు. "అమ్మ.. నీ గురించి రెండు మాటలు రాద్దామని పెన్ను పట్టగానే కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి" అంటూ మొదలుపెట్టి, బాల్య వివాహపు బానిసత్వం నుండి కాన్సర్ మహమ్మారి వరకు ఆమె సాగించిన పోరాటాన్ని అక్షరాల్లో బంధించారు. "నువ్వు జ్ఞాపకానివి కావు. నా మనాదిలో ఆదికావ్యానివి" అన్న ముగింపు పాఠకుడి హృదయాన్ని ద్రవింపజేస్తుంది.

జీవన తత్త్వం - యవ్వన పాఠం:

మనిషి తన జీవిత ప్రయాణంలో కోల్పోతున్న విలువలను, మానవ సంబంధాలను 'యవ్వన పాఠం' కవిత ద్వారా గుర్తుచేశారు.

**"రేపు ఇద్దరిలో ఒక్కరే ఉండొచ్చు/ అందుకే చెబుతున్నా ఉన్నంతకాలం ఒక్కరిగా జీవించాలి"**

పరుగుల ప్రపంచంలో అమాయకత్వాన్ని చూసి యవ్వనం జాలిపడుతుందని, మన వయస్సును మనమే గిలిగింతలు పెట్టి, కేక పెట్టించాలని కవి చెప్పిన తీరు అద్భుతం.

### మానవీయ కోణాలు: స్త్రీ అస్తిత్వ చిత్రణ:

ఈ పుస్తకంలోని మౌనశ్రీ మల్లిక్ కవితలను పరిశీలిస్తే, స్త్రీల పట్ల ఆయనకు అత్యంత గౌరవప్రదమైన, సున్నితమైన మరియు విప్లవాత్మకమైన దృక్పథం ఉందని అర్థమవుతుంది. వివిధ కవితల్లో ఆయన స్త్రీని చూసే కోణాలు ఇలా ఉన్నాయి:

**'మాజీ ప్రేయసికి'** కవితలో విడిపోయిన ఇద్దరు వ్యక్తుల మధ్య ఉండాల్సిన పరిణతి (Maturity) గురించి మాట్లాడుతుంది. గతించిన గతం ఎదురైనప్పుడు ద్వేషంతో కాకుండా చిరునవ్వుతో పలకరించుకోవాలని కవి కోరుకుంటున్నారు. "నువ్వు చేసిన మోసం గురించి.. మన మధ్య జరిగిన ఘర్షణ గురించి.. ఏమీ మాట్లాడను" అనడం ద్వారా పాత గాయాలను కెలికే ప్రయత్నం చేయవద్దని, కేవలం ఆ క్షణాన్ని ప్రశాంతంగా గడపాలని కవి భావిస్తున్నారు. వయసు మళ్లుతున్న కొద్దీ మనిషిలో వచ్చే ప్రశాంతత ఈ కవితలో కనిపిస్తుంది. స్త్రీని ఒక 'వస్తువు'గా కాక, భావోద్వేగాలు ఉన్న ఒక 'వ్యక్తి'గా చూడటం ఈ కవితలోని గొప్పతనం.

'ఈప్సితం' ఒక స్వచ్ఛమైన ప్రేమారాధన కవిత. ప్రేయసిని ప్రకృతిలోని అపురూపమైన అంశాలతో పోలుస్తూ ఆమెను ఎలా చూసుకోవాలో కవి వర్ణిస్తున్నారు. నది పుట్టిన చోట పాదాలు కడగడం, ఎర్రటి ఎండ తగలకుండా పూలతో పూజించడం వంటివి అమితమైన అనురాగానికి ప్రతీకలు. నిద్రిస్తున్నప్పుడు ఆమెపై సీతాకోకచిలుకలు కూడా వాలకుండా చూసుకోవాలనుకోవడం ఆమె పట్ల ఉన్న సున్నితమైన ప్రేమను తెలియజేస్తుంది. స్త్రీ సౌకుమారాన్ని గౌరవిస్తూనే, ఆమెను అత్యున్నత స్థానంలో ఉంచడం ఇక్కడ కనిపిస్తుంది.

'ప్రాణ స్పందనలు' అనే కవిత మట్టిపై ఉన్న మమకారాన్ని, అస్తిత్వాన్ని చాటిచెప్పే కవిత. సమ్మక్క-సారక్క జాతర (మేడారం) నేపథ్యంతో సాగుతుంది. ఆ మట్టిలో పోరాట పాఠాలు ఉన్నాయని, అడవి బిడ్డల తెగువ ఉందని కవి గుర్తు చేస్తున్నారు. మేడారం జాతరను "మహా కుంభమేళా"గా అభివర్ణిస్తూ, అక్కడికి వెళ్లిన వారు ఆ మట్టిని నుదుట రాసుకోవాలని చెప్పడం ద్వారా ఆ ప్రాంతం పట్ల ఉన్న భక్తిని, గౌరవాన్ని చాటారు. బహుశా స్త్రీల పట్ల కవికున్న అత్యున్నత దృక్పథం ఈ కవితలో కనిపిస్తుంది. ఇక్కడ స్త్రీ అంటే కేవలం ప్రేమ, అందం మాత్రమే కాదు, శక్తి, పోరాటాలకు ప్రతీక.

స్త్రీ అస్తిత్వం, వారి త్యాగాలు సమాజానికి అందించే స్ఫూర్తిని కవి గౌరవిస్తారు. స్త్రీని ప్రకృతితో పోల్చడం ద్వారా, ఆమె ఉనికి లేనిదే సృష్టి లేదని ఆయన బలంగా నమ్ముతున్నట్లు తెలుస్తుంది.

మనిషి అంతర్ముఖ ప్రయాణానికి అక్షర రూపం.

ఈ పుస్తకంలోని మొదటి కవిత ' అమూర్తం. ఈ కవిత కేవలం ప్రకృతి వర్ణన కాదు, ఇది ఒక ధ్యానం లాంటిది. మనిషి తనను తాను కోల్పోయి, ప్రకృతిలో భాగమైనప్పుడే 'అమూర్త'మైన ఆనందం అందుతుందని, కవి చాలా అందంగా వివరించారు.

పుస్తకానికి ఇది మొదటి కవిత కావడం వల్ల, పాఠకుడిని భౌతిక ప్రపంచం నుండి భావ ప్రపంచంలోకి తీసుకెళ్లడానికిది ఒక ద్వారంలా పనిచేస్తుంది.

సామాజిక స్పృహ - అస్తిత్వ వేదన:

ఈ సంపుటిలో కవితలు, వ్యక్తిగత వేదన వద్ద ఆగిపోవు. అవి సమాజపు మూలాల్ని తాకుతాయి.

మౌనశ్రీ మల్లిక్ కవిత్వంలో ప్రాకృతిక ప్రతీకలు చాలా సహజంగా ప్రవేశిస్తాయి. అవి అలంకారాలకై కాకుండా, భావాలను మోసే సాధనాలుగా నిలుస్తాయి. ఉదాహరణకు

**"ఆకుల్ని వణికించిన గాలి**
**చెట్టును మాత్రం**
**కూల్చలేకపోయింది."**

ఇక్కడ 'ఆకు' సాధారణ మనిషి అయితే, 'చెట్టు' అస్తిత్వం. చిన్న ఒత్తిడులు మనల్ని వణికిస్తాయేమోగానీ, లోపలి బలాన్ని కూల్చలేవన్న దృక్కోణం ఈ పంక్తుల్లో కనిపిస్తుంది.

**చలనమే ఈ సంపుటి ఆత్మ:**

ఈ పుస్తకానికి కేంద్ర బిందువు చలనం. అది కేవలం శారీరక కదలిక మాత్రమే కాదు, మనసులోని వివేచన చలనం. కవి ఒకచోట ఇలా స్పష్టంగా చెబుతాడు.

**"కదలకపోవడమే**
**అత్యంత ప్రమాదకరమైన స్థితి"**

ఈ ఒక్క వాక్యం ఈ సంపుటి ఆత్మ. ప్రశ్నించని మనస్సు, ఎదగని ఆలోచన, మారని సమాజం - ఇవన్నీ ప్రమాదకరమని కవి మౌనంగా హెచ్చరిస్తాడు.

భాష పరంగా చూస్తే, మౌనశ్రీ మల్లిక్ పదజాలం చాలా సరళం. కానీ ఆ సరళత వెనుక ఉన్న భావభారం పాఠకుడిని వెంటాడుతుంది. ఎక్కడా క్లిష్టత లేదు. అయినా భావం లోతుల్లో ముంచుతుంది. ఇది ఈ కవిత్వానికి ఉన్న ప్రధాన బలం.

'చలనా కాంక్ష' మనిషిని తనలోకి తాను చూసుకునేలా చేసే కవితల సంపుటి. ఇది చదివిన తర్వాత పుస్తకంలోని పేజీలు మూసుకుంటాయి. కానీ ఆలోచనలు మాత్రం కొనసాగుతూనే ఉంటాయి. నేటి తెలుగు కవిత్వంలో ఆలోచనాత్మక

### ప్రకృతి - తాత్వికత:

'మననం'అనే కవిత ఒక తాత్విక (ఖప్తతిశ్రీనీబనీజూప్త్రతిఇ·జీశ్రీ) కవిత. ప్రకృతి పాఠశాల వంటిదని, పర్వతాలు జీవిత సారాన్ని చెప్తాయని కవి భావిస్తున్నారు.

'జీవన దర్శనం× కవిత మనిషి తన ఉనికిని తెలుసుకోవడానికి, ప్రశాంతతను పొందడానికి ప్రకృతిలో మమేకం కావాలని చెప్తున్నారు. "సృష్టి సారించాలంటే మనిషికి దృష్టి ప్రధానం" అని చెప్తూనే, ప్రకృతిని ప్రేమించడంలో ఉన్న గొప్పతనాన్ని వివరించారు.

మౌనశ్రీ మల్లిక్ కవిత్వంలో ప్రకృతి ప్రతీకలు భావాన్ని మోసే సాధనలుగా నిలుస్తాయి:

చెట్టు కవితలో "ఇంట్లో ఒక చెట్టు ఉండాలి.. జీవన తాత్వికతను బోధిస్తూ.. నిత్యం గాలి చేతులతో దీవించే నీడ లాంటి తోడు ఉండాలి" అంటూ చెట్టును ఒక కుటుంబ సభ్యునిగా చిత్రించారు.

జ్ఞానం ఇగిరి పోదు కవితలో "పుట్టినందుకు అడుగైనా వేయకుంటే ఎలా?" అని ప్రశ్నిస్తూ, మట్టిని అడిగితే అది ప్రాణి పుట్టుకను హరికథలా చెబుతుందని వివరిస్తారు.

ఇలా ఈ పుస్తకంలోని ప్రతీ కవిత గొప్ప తాత్విక దృష్టిని కలిగి ఉంటుంది.

### శైలి - శిల్పం:

మౌనశ్రీ మల్లిక్ కవిత్వంలో క్లిష్టమైన పదజాలం ఉండదు. కానీ, ఆయన వాడే సరళమైన పదాల వెనుక ఒక అగ్నిపర్వతమంత ఆవేదన, సాగరం అంతటి లోతైన తాత్వికత ఉంటుంది. "కదలకపోవడమే అత్యంత ప్రమాదకరమైన స్థితి" అని హెచ్చరిస్తూ, నిరంతరం చలించాలనే 'చలనకాంక్ష'ను పాఠకుడిలో కలిగిస్తారు.

### ముగింపు:

'చలనకాంక్ష' కేవలం చదివి పక్కన పెట్టే పుస్తకం కాదు; అది మనల్ని మనం ప్రశ్నించుకునేలా చేసే ఒక దర్పణం. ఈ కవితలు ప్రధానంగా మానవ సంబంధాలు, ప్రకృతి ఆరాధన, సామాజిక స్పృహ మరియు ఆత్మావలోకనం వంటి అంశాల చుట్టూ తిరుగుతాయి. అడవి బిడ్డల కన్నీ టి నుండి అమ్మ త్యాగం వరకు, యవ్వనపు అలజడి నుండి సమాజపు నిశ్శబ్దం వరకు ప్రతి అంశాన్ని కవి స్పృశించిన తీరు ప్రశంసనీయం.


నేటి తెలుగు సాహిత్య రంగంలో ఒక అర్థవంతమైన చర్చకు దారితీసే గొప్ప కవితా సంపుటి చలన కాంక్ష.




**-మామిడి అమరేందర్**
7780353511

పుస్తక సమీక్షలు

## సమకాలీన పరిస్థితులకు అద్దం పట్టిన కథలు







ప్రతులకు:
కె.అమృత జ్యోత్స్న
9490428866

**అ**మ్మ... పదాలే తెలియని మన పెదాలకు మొదటి పలుకు అమ్మ.ఈ సృష్టిలో ఇంతకు మించిన తీయని పదం మరొకటి లేదన్నది సత్యం.నరకయాతనతో కూడిన ప్రసవవేదనని భరించి,బిడ్డకు జన్మనిచ్చి,తాను మరోజన్మనెత్తుతుంది.తన రక్తాన్ని పాలుగా మార్చి బిడ్డల ఆకలిని తీర్చుతుంది.మాతృత్వపు మమకారాన్ని అందిస్తూ వారి జీవితాల్లో వెలుగులు నింపుతుంది.అమ్మంటె ఒక భగవద్గీత,ఒక ఖురాన్,ఒక బైబిల్.

రాజులు యుద్ధాలకు వెళ్ళినా, యుద్ధంలో గెలిచినా ముందుగా నమస్కరించేది మాతృమూర్తికే. కవులు,రచయితలు, కళాకారులు అమ్మ ప్రేమ గురించి ఎంతగానో వర్ణించారు.అమ్మ ప్రేమపై ఎన్నో పాటలు రాశారు.తన తల్లిని మదిలో తలచుకొని "కదిలే దేవత అమ్మ...కంటికి వెలుగమ్మ " అని చంద్రబోస్ రాశాడు."అమ్మను మించిన దైవమున్నదా" అని సినారె రాసినా,"అమ్మంటే అంతులేని సొమ్మురా,అది ఏనాటికి తరగని భాగ్యమ్మురా,అమ్మ మనసు అమృతమ్ము చిందురా,అమ్మ ఒడిలోనే స్వర్గమ్ము ఉందిరా"అని దాశరథి కృష్ణమాచార్య రాసినా తక్కువే. అమ్మ గురించి ఎంత చెప్పినా తక్కువే...అమ్మ అంటె అందరికి మక్కువే.అమ్మకు అమ్మనై పుడితే తప్ప అమ్మ గురించి తెలియదు.అలాంటి మహోన్నతమైన అమ్మ గురించి కె.అమృత జ్యోత్స్న రాసిన కథలే "అమ్మ కథలు" .

కొడుకుపై అమ్మకున్న అపారమైన నమ్మకాన్ని వమ్ము చేసిన కథ "ఓ అమ్మ వ్యథ. పెద్దల మాట చద్దన్నం మూట అంటారు.అమ్మ మాటలను జవదాటని ఓ కుమారుడు చేసిన మంచి పనిని "అమ్మ మాట" కథలో చెప్పారు. ఫలితం ఆశించకుండా చేసేదే నిజమైన సాయమని ప్రకటించారు.అమ్మంటే ఏమిటో తెలుపుతూ చిన్నప్పుడు అమ్మతో గడిపిన మధుర జ్ఞాపకాలను వివరించిన కథ "అమ్మ చేతి ముద్ద".

తాను పెరిగిన నేపథ్యాన్ని మర్చిపోయి,స్వార్థంతో ఎదుటివారిని అర్థం చేసుకోకుండా బాధించే మనుషులను మనం చూస్తుంటాం.అలాంటివారు పెట్టే బాధలను సహనంతో మౌనంగా భరించే సహృదయులు ఉంటారు.అలా మూర్ఖంగా ప్రవర్తిస్తూ తల్లిని తన స్వార్థం కోసం వేధించిన కూతురు వల్ల చింతనతో చితికి చేరిన తల్లి కథే "మాతృ హృదయం"

కాలంతో పోటీ పడుతూ,సంపాదన ధ్యాసలో పడి చిన్నారులను పట్టించుకునే తీరిక లేక 'డే కేర్ సెంటర్లో' అప్పగించి బాధ్యత తీరిందని భావించే తల్లిదండ్రులున్న కాలమిది. తల్లి ప్రేమకు దూరమైన ఆ చిన్నారి వ్యక్తిత్వం ఏ రూపంలో బహిర్గత మౌతుందో ఊహించలేం. రేపు తల్లి దండ్రులను వృద్ధాశ్రమంలో చేర్పించే ప్రయత్నాలు జరుగవచ్చు... చిన్నారులు తల్లిదండ్రులతో గడిపినప్పుడే బంధాల విలువలు అర్థమౌతాయని, ఉత్తమ వ్యక్తులుగా ఎదుగుతారని సూచించే కథ "అమ్మతనం"

"ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటుంది. సమస్యని పట్టుకుని వేలాడితే ఒక అడుగు కూడా ముందుకు వేయలేము". చిన్న చిన్న విషయాలకి జీవితాన్ని అంతం చేసుకుంటున్న సంఘటనలు ఎన్నో మనం చూస్తున్నాం. జీవితం దేవుడిచ్చిన వరం.

సమస్యలకు భయపడి అర్థాంతరంగా ముగించడం తప్పని,మంచి రోజులు తప్పక వస్తాయని ,ఆశావాద దృక్పథంతో ముందుకు నడవాలనే సందేశాన్ని అందించిన కథ"నడిచే భగవద్గీత అమ్మ" అలాగే క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయాల వల్ల ఎలాంటి తీవ్ర ప్రభావాలు ఏర్పడతాయో తెలిపిన కథ "అమ్మ విలువ."

తన ఇంట్లో పనిచేసిన శకుంతలమ్మ మనమరాలికి సీమంతం చేసి ,తన కోసం తన భర్త తెచ్చిన బంగారు గాజులను తొడిగి మానవత్వాన్ని చాటుకున్న రాజేశ్వరి ఆదర్శనీయ మహిళగా నిలిచింది.

ఈ కథ తప్పకుండా పాఠకుని మనసును తడి చేస్తుంది.

అమ్మ త్యాగానికి ప్రతీక.సంతానం కోసం ఏదైనా చేస్తుంది.తన పిల్లలు ఎదగాలనే తపన...పదిమంది తన పిల్లల గొప్ప తనం గురించి చెప్పుకోవాలని కోరుకుంటుంది. అలాంటి ఓ తల్లి కథే"అమ్మ"

ఈ రోజుల్లో సమిష్టి కుటుంబాలు ఎక్కడో ఒకటి రెండు కన్పిస్తాయి. అందరూ వ్యష్టి కుటుంబాలకే మొగ్గు చూపు తున్నారు. సమిష్టి కుటుంబాల్లో తాతలు, నానమ్మలు, బాబాయిలు,అత్తా మామలు అందరూ ఉండటం వల్ల పిల్లల్లో విలువలు పెరుగుతాయి. బాధ్యతలను గుర్తిస్తారు. బంధాలను పెంచుకుంటారు. సహకారం, ధర్మం,న్యాయ వర్తనం అలవడుతాయి.ఈ విషయాలను చక్కగా విశ్లేషించిన కథ"ఓ అమ్మ సలహా"

ఉదయం నుండి పడుకునే వరకు ఎన్నో పనులతో సతమతమౌతూ, ఇంటిల్లిపాదికి సేవలు చేస్తూ, తన జీవితాన్ని వంటింటికే అంకితం చేసిన ఇల్లాలి సేవలను అటు భర్త ఇటు పిల్లలు గుర్తించకపోవడం దారుణం. కామాక్షమ్మ ఇల్లాలి విలువ భర్తకు,అమ్మ విలువ పిల్లలకు తెలిసేలా చేసి వారిలో కనువిప్పు కలిగించింది . మనకు కూడా గొప్ప పాఠాన్ని నేర్పిన కథ "ఓ అమ్మ కథ"

మహిళ మాతృమూర్తిగా మారాక శిశువు జన్మించినప్పటి నుండి తాను మరణించే వరకు తన సంతానం గురించే ఆలోచిస్తుందని ఉటంకించిన కథ"అమ్మతో కాసేపు" తానెంత ఎత్తుకు ఎదిగినా తన మూలాల్ని మరచిపోని వాడే మనిషియని చాటి చెప్పిన కథ "అమ్మ కష్టం తెలుసుకో"ఇలా "అమ్మ కథలు" కథా సంపుటిలో నేటి కాలపు అమ్మల వేదనలు, ఆవేదనలు, సంతానంపై అమ్మకున్న ప్రేమ, ఆప్యాయత అనుబంధాల పరిమళాలు,తల్లి పట్ల నెరవేర్చాల్సిన బాధ్యతలు, అమ్మ ఆలోచనలు,ఆదరణ కరువైన తల్లుల వెతలు,బిడ్డల పట్ల తల్లి బాధ్యతలు తదితర అంశాలపై చక్కని కథలను అందించారు. సంక్షిప్తంగా, అవసరం మేరకే కథా కథనాన్ని కొనసాగిస్తూ సాగిన నాలుగు పేజీలలోపు కథలివి.ఈ కథలు బిడ్డలను జాగృత పరుస్తాయి .సమకాలీన పరిస్థితులకు అద్దం పడతాయి.

అమ్మల గుండె చప్పుళ్ళని కథలుగా మలిచి అందించిన కె.అమృత జ్యోత్స్న గారికి అభినందనలు.



**-వైరాగ్యం ప్రభాకర్**
9014559059

## నేను నేనే...

నేను
రంగును.. రూపాన్నే కాదు
ఇప్పుడు.. సారాన్ని కూడా...
మనిషి లోనీడను.. జాడను నేనే...
ఆకలి దప్పికలు..ఆశలు..స్వార్థం..
కుళ్ళు కుతంత్రాలు..నా ఆటస్థలాలు...
నా ఒంటినిండా కళ్ళు..
నా చూపుల్లో చిక్కని ఆకారం ఉండదు-
నా మాటకు లొంగని అస్తిత్వం ఉండదు-
చేతులెవరివో...
మూతులెవరివో...
ఎక్కడా సంశయించను..?
చేతులు మారటంలోని మజా
నాకు మాత్రమే తెలుసు-!
దోచుకున్నవాడినీ చూస్తాను..
దాచుకున్నవాడినీ చూస్తాను...
మాట మార్చిన వాళ్ళు
మనసు మార్చిన వాళ్ళు.
మనిషి.. మనిషికి..ఎన్నెన్ని
లోగుట్టురంగులో ...!?
లోకమంతా విహరిస్తాను..
విస్తరిస్తాను...
బతుకు సంకోచ వ్యాకోచాలు
నాతోనే-
ఇప్పుడు జీవికి.. జీవితానికి.. నేనే..!
ఉనికికి.. ఉన్నతికి.. నేనే..
నా పిలుపుల్లో పరుగులు పెట్టని
వాళ్ళుండరు..
నా వలపు కౌగిట్లో చిక్కని
వాళ్ళుండరు..
ఎవ్వరో తప్ప
మారుతున్న కాలంలో
అంతా నాకు బానిసలే...!
నాకోసం పరితపించే వాళ్ళే...!
కనిపించేది కొంత -
కనిపించనిది కొంత -
ముఖాలు కొన్ని..
ముసుగులు కొన్ని..
రుచిని.. శుచిని..అన్నీ
నేనే..అంతటా
నేనే...
సర్వ కామనల పరితృప్తి నాతోనే -
నాకు కులంలేదు.. మతం లేదు
అసలు పంచభూతాలనే కాదు,
ఆరో భూతంగా నన్నూ ఆవాహన
చేసుకుంటారు..!
ఆశల పరికల్పనలు.. పరిధులు...
ఇప్పుడు నాచుట్టే..!
ఊహలకు.. ఊపిరికి అందని దాన్ని
-
సకల వ్యవస్థల అవస్థల పునాదులు
నాలోనే...
మనుషుల మాయా జగత్తుకు
లేని మెరుపులద్దేది నేనే...
నేను నేనే...
నేను సర్వాంతర్యామిని...!
బహురూపాల రూపాయిని..!!



**-మోతుకూరి అశోక్ కుమార్**
9247380976

# సామాజిక సమరకవి సమ్మన్న!



-డా॥నాళేశ్వరం శంకరం
సెల్:94404 51960

సమ్మన్న స్నేహశీలి, సన్నిహితుడు, సామాజికుడు, సహృదయుడు, గొప్పల కోసం రాసే గొట్టుమాటల కవి కాదు. విన్నంత, కన్నంత సగటు మనిషికి అర్థమయ్యే భాషలో రాసే సహజ కవి. పేగు బంధాల ప్రేమల్లోనే కాదు ప్రజాబంధాల్లోను మమేకమయ్యే కవి, ప్రజలు బాగుండాలనీ, ఒకరి సుఖదుఃఖాలను మరొకరు పంచుకోవాలనీ లేని వాణ్ణెప్పుడు మానవీయ కోణంతో నిరంతరం కాపాడాలన్న మానవీయ కవి. ఆయనలో సామాజిక స్పృహ, చైతన్యం విద్యార్థి దశనుంచే ఉన్నాయి. కులమతాలకు అతీతమైన ఆలోచనల కవి.

డా॥ ఈటెల సమ్మన్న ఇప్పటివరకు **'అక్షరహారతి'**, **'సిరి మువ్వలు'**, **'కొన్ని కన్నీటి చుక్కలు'**, **'అంతఃప్రయాణం'** వంటి కవితా సంపుటాలు ప్రచురించాయి. వచన కవిత్వమే కాక **'అమృతత్త్వం'** పేరుతో దీర్ఘ కవితను ప్రచురించి తనలోని వచన కవితను విస్తృతపరుచుకున్నారు. ఆయన **'సిరి మువ్వలు'**, **'గజ్జిగలు'** పేరుతో కన్నడంలోకి అనువాదమైంది. **'అక్షర హారతి'** కవితా సంపుటం **'వర్డ్ ఆఫరింగ్'** పేరుతో ఆంగ్లంలోకి అనువాదమైంది. ఇప్పుడు **"నాన్నా! నీకు నూరేళ్ళు..."** పేరుతో నాన్నకు వందవ జన్మదిన కానుకగా తెస్తున్నందుకు నేనొక అనూహ్య సంబురంగానే భావిస్తు న్నాను. ఈ సంపుటాన్ని తల్లిదండ్రులకు అంకితం చేయడం మరింత ముదావహం.

అమ్మానాన్నల మీద రాసిన కవితలో పాటు మరో ఇరవై ఎనిమిది కవితలు సామాజిక సంఘటనల మీద, సందర్భాల మీద తనదైన భావాలతో, వ్యక్తీకరణతో ఈ సంపుటం మన ముందు ఆవిష్కరించబడింది. సామాజిక వస్తువ్యాఖ్యాన పద్ధతి కవిత్వమంతా పరుచుకుని ఉంది. అతలాకుతలంగా ఉన్న సమాజం, దాన్ని వికృతపరుస్తున్న స్వార్థశక్తులను ధిక్కరించిన కవిత్వమిది. కవిలోని అంతర్గత ఘర్షణను ఈ కవితలు బహిర్గం చేస్తాయి.

సమ్మన్న ఒక్క కవే కాదు. సాహిత్య కార్యకర్త. ఏ కవికీ లేని సుగుణాలు సమ్మన్నలో ఉండటం ఒక విశేషణం. ఆయన చెప్పే దానికే కాదు చేతల్లో చూపే కవి. ఆయన సంఘసేవకునిగా పేదల పెన్నిధిగా ప్రజల మన్ననలు పొందుతున్న విద్యావేత్త. ఒక పక్కన అధ్యాపకుడు, మరో పక్కన సామాజిక కార్యకర్తగా శ్రమిస్తూనే 'నిశాంత్ మెమోరియల్ ట్రస్టు', 'ఎడ్యుకేషన్ చారిటబుల్ ట్రస్టు,' 'ఆనంద వృద్ధాశ్రమ ట్రస్టు'లలో ప్రధాన భూమిక నిర్వహిస్తున్నారు. తెలుగు సాహిత్య కళాపీఠం ద్వారా ప్రజల మన్ననలు పొందుతున్న ప్రజల మనిషి సమ్మన్న.


సమ్మన్న ఎంతటి సంఘ సేవకుడో అంతటి కవనధారల కవి. శతవసంతాల నాన్న, అమ్మపై రాసిన కవితలు **'తల్లీ! నిన్ను దలంచి'**, **'తండ్రీ! నిన్ను దలంచి'** అని వినమ్రతకు నిలువెత్తుగా నిలుపుతూ రాశాడు. నాన్న వందవ జన్మదినాన్ని పురస్కరించి రాసిన కవి సమ్మన్ననే. నాన్న మీద ఏ కవయినా రాయ వచ్చు గానీ తండ్రిగారి వందవ జన్మదినాన కవిత రాసే అదృష్టం సమ్మన్నకే దక్కింది. నాన్నకు చదువు లేకున్నా అనుభవ విద్యాసంపన్నుడే. ఇలవేల్పే! ఆయన కర్తవ్య దీక్ష, నిరంతర శ్రమ, నైతిక ప్రవర్తన అంతా ఒక యూనివర్సల్ ఫాదర్ కేరెక్టర్‌కు అద్దం పడుతుంది.

అలాగే **'అమ్మ'** కవిత. ఇది సమ్మన్న అమ్మ ఆత్మకథనే కాదు, అందరి అమ్మల ఆదర్శవంతమైన ఆత్మకథలా సాగింది.


**'ఇంటి చాకిరిలో అమ్మ తనవు చీకిన చాపయింది**
**పంటపొలంలో ఆమె నెత్తురు యింకి నీరయింది**
**ఒక్కోమారు**
**అనుబంధాల వలలో చిక్కుబడిపోయిన పక్షి అవుతుంది.**
**అనుభవిస్తే తప్పఅర్థం కాని జీవన కావ్యమైపోతుంది!'**

నిజమే! కవిత ఆసాంతం చిక్కని కవిత. అమ్మ ఎదుర్కొనే కష్టాలు, ఓర్పు, సహనం, దృఢత్వం, చలనశీలతతో పాటు రోజువారీ శ్రమలో ఆమె వొక యంత్రపు చక్రమైపోతున్న స్థితిని బలంగా ఎత్తిచూపాడు.

మానవత్వానికి మించిన దైవం లేదనే కవిత అంతర్వాణి. యాదాద్రి దేవాలయ నిర్మాణ శిల్పుల సృజనాత్మక నైపుణ్యాన్ని ప్రశంసిస్తూ 'వర్ధిల్లండి చిరంజీవులై' అనడం ఔచిత్యంగా ఉంది.







ప్రతులకు:
డా॥ సమ్మన్న ఈటెల,
207, సిరి రెసిడెన్సీ
స్ట్రీట్ నెం.2, తార్నాక
హైదరాబాద్-17.
సెల్: 9885238654

**'ప్యారడైజ్ లాస్ట్'**, **'మౌన రోదన'**, **'దేనికి సంకేతం'** కవితలు విలక్షణమైనవి. తమ అక్రమార్జనను విదేశాలకు తరలించి పెట్టుబడులుగా మార్చుకుంటున్న నల్ల ధనకుబేరుల చీకటి ధన భాగోతాన్ని 'ప్యారడైజ్ లాస్ట్' బట్టబయలు చేసింది. 'సంపన్న వ్యక్తుల సెలబ్రిటీలు దేశాధి నేతలు', ప్రజానేతల పేరున జీవించే నల్ల ధనదాహుల్ని కవి తెరకెక్కించారు.

**డా॥సమ్మన్న ఈటెల రచించిన 'నాన్న నీకు నూరేళ్ళు' పుస్తకానికి డా॥నాళేశ్వరం శంకరం రాసిన ముందు మాట..**

**'మౌనరోదన'** కవిత బీహారు రాష్ట్రంలో ముగ్గురు అక్కాచెల్లెళ్ళ అత్యాచారానికి స్పందించి రాశారు. అలాగే 'దీనికి సంకేతం' కవితలో మహిళలపై అత్యాచారాలలో భారతదేశం ప్రపంచంలోనే అగ్రస్థానమన్న వార్తకు సిగ్గుపడి నిస్సిగ్గుగా బతుకుతున్న కామాన్ని ధిక్కరించారు. ఆధిపత్య పురుషకాముక సమాజాన్ని ఎదిరించాలని రాశాడు. ఇలాంటి ధిక్కారధోరణి, ఎదిరింపు, తెగింపు కవితలు ఇందులో వున్నాయి.

భారతదేశ సామాజిక రుగ్మతలలో ఆహారం ఒక సమస్యగా ఉంది. ఆహారంగా ఇది నిషేధించాం. దీన్ని తినకూడదని చెబుతున్నప్పటికీ తినడం పుట్టుకతో వచ్చిన హక్కుగా చెప్పడం వల్ల కులమతాల మధ్య హింసాత్మక సంఘటనలు చేటుచేసుకున్న నేపథ్యంలో ఓ భారతీయుడా! కవిత రాశాడు. రాజ్యాంగం ప్రసాదించిన హక్కులను కాలరాయడం విరుద్ధం. ఎవరి ఆహారం వారిది. ఒకరి ఆహారంపై మరొకరి ఆధిపత్యమేమిటి? చిచ్చురేపడమేమిటని వ్యాఖ్యానిస్తుంది ఈ కవిత.

ఈ సంపుటిలో అన్నీ కవితలే ఉన్నా ఒకే ఒక్క పాట కూడా ఉంది. ఈ వేడుకోలు పాటకున్న ఆంతర్యం ప్రజలు ప్రమానురాగాలతో జీవించాలని, మానవీయ దృక్పథంతో ముందుకు సాగాలని అభ్యుదయ భావాలతో హింసోన్మాదాన్ని దుయ్యపడుతూ రాశాడు. పర్యావరణ పరిరక్షణ నేడు అత్యవసరమని నొక్కిచెప్పాడు. 'గాలీ నేలా నీరు వ్యర్థాలతో నిండి, పర్యావరణమంత విషవలయంగా మారితే హరితవనాలన్నీ అంతరించిపోతే' మన మనుగడ ప్రశ్నార్థకంగా మిగులుతుందని హెచ్చరిస్తాడు.

సమ్మన్న సంఘసేవకుడు. సామాజికుడు. ఆయన సామాజిక చరిత్రను అధ్యయనం చేసినట్లే వైజ్ఞానిక సాంకేతిక విజ్ఞానాన్ని ఆపోసన పట్టాడు. సైన్సుపై మక్కువ ఉండటం వల్ల మూడు కవితలు శాస్త్రవిజ్ఞానంలోంచి రాశాడు. జోహార్ **'స్టీఫెన్ హాకింగ్'**, **'జీరో కెల్విన్'**, **'జన్యుమాయ'** కవితలు సైన్సు కవితలైనా భిన్నమైనవి. హాకింగ్ భౌతిక శాస్త్రవేత్త, వైకల్యం దేహానికే గాని మేధస్సుకు అవరోధం కాదన్నాడు. హాకింగ్ జీవితాంతం యుద్ధోన్మాదాన్ని నిరసించాడు. అతడు ఆరని అమరదీపంగా ఉంటాడని నిలువెత్తు కీర్తించాడు. 'జీరో కెల్విన్' కవిత శాస్త్ర ప్రపంచంలో పరమనిమ్న ఉష్ణోగ్రతని (జీరో కెల్విన్ మైనస్ 273.16) సాధించడానికి ప్రయత్నిస్తున్న శాస్త్రవేత్తలను కీర్తిస్తూనే దిగజార్చుతున్న అరిషడ్వర్గాల్నీ శూన్యస్థితికి చేర్చే మార్గాన్ని అన్వేషించమని వేడుకుంటాడు. వ్యక్తి నైతిక ప్రగతి, ప్రపంచశాంతికి తగినవిధంగా జీరో కెల్విన్ స్థాయికి మానవ జీన్స్ సంస్కరించాలని అర్థిస్తాడు. **'జన్యు మాయ'** కవితలో జన్యువులను **'టింకరింగ్'** చేస్తూ డిజైనర్ బేబీల సృష్టికి బదులు జీవన విలువల్ని పెంపొందించే జన్యు పరిశోధన జరగాలని తనలోని ఆశాభావాన్ని వ్యక్తపరిచారు.

సమాజాన్ని పట్టి పీడిస్తున్న రుగ్మతల్లో బాబాల రుగ్మత ఒకటి. బాబాలు అమాయక ప్రజల్ని చేరదీసి వారి ఆపదలను క్యాష్ చేసుకుంటూ ఆధ్యాత్మికం పేరుతో అత్యాచారాలకు పాల్పడుతున్న బాబాల్లో డేరాబాబా ఒకడు. డేరాబాబా గుట్టురట్టయి 'కటకటాల్లో' పెట్టారు.

**"డేరాబాబా గుట్టు రట్టయింది**
**మానవమృగపు పాశవిక క్రీడల్లో**
**మానసిక క్షోభ అనుభవించిన**
**మహిళ మొర న్యాయస్థానం ఆలకించింది.**
**న్యాయదేవత కరుణతో**
**నయవంచకుడి శిక్ష ఖరారు చేసింది"**

ఈ కవితలో వచనముండవచ్చు. వస్తువు ప్రధానమైంది. సామాజిక శ్రేయస్సును కాంక్షించే అభ్యుదయ కవులు మరింత బలంగా రాయాలి. జైలుచువ్వలు లెక్కపెడుతున్న డేరాబాబుమీద రాయడమే ఒక విశేషణం. మంచి కవిత.

**'తలాక్'** కవిత లౌకికవాద కవిత. ముస్లిం మతంలో తలాక్ అని మూడుమార్లు అంటే విడాకులు ఇచ్చినట్టే. తలాక్ అనేది ఒక మతాధిక్య ధోరణే. దీనిపై ధర్మాసనం తీర్పు ఇవ్వకముందే సమ్మన్న కవిత తలాక్ మీద రాయడం విశేషం. దూరదృష్టికి చిహ్నం. ముస్లిం మతంలో మగ్గిపోతున్న మహిళలపట్ల కవికి అభిమానముంది. సవాలక్ష ముస్లిం మహిళా సమస్యలలో తలాక్ సమస్య ఒకటి. వస్తు వైవిధ్యానికి, అభ్యుదయానికి ఇది సంకేతం.

ఇలా అభ్యుదయ, సామాజిక భావజాలంగల కవితలతో పాటు సమాజ మార్పును, వ్యష్టి, సమిష్టి మార్పులను కాంక్షించిన కవితలలో అది అంతే! **'అంధలోకం'**, **'మళ్ళీ మానవజన్మే'** **'దైవం అదృశ్యం'**, **'ఎక్కడుంది లోపం?'**, **'హెచ్చరిక'**, **'చింతనామృతం'**, **'దివ్యస్పర్శ'** వంటి కవితల్లో ప్రధానంగా మానవీయతత్త్వముంది.

కవి లోకంలోని లోపాన్ని దనదాహంలో ఉంటుందంటారు. అన్యాయం, అవినీతి, అధికారం అందులోంచే జనిస్తూ ఉందనీ, అందులోంచే స్వార్థప్రవర్తన పెరిగి కనీసం ఉండవలసిన ఇంగిత జ్ఞానం కూడా మనిషిలో ఉండటం లేదంటారు. త్యాగభావన, జ్ఞాన సాధన, శాంతి, సౌఖ్యం, భూత దయ ఉంటేనే మానవీయతత్త్వం విస్తరిస్తుందని చాలా కవితల్లో వ్యక్తీకరించారు.

**'విరాజిల్లు వెయ్యేళ్ళు'** కవిత ఉస్మానియా విశ్వవిద్యాలయ శతాబ్ది సందర్భంలో రాసిన మంచి కవిత. ఉస్మానియా విశ్వ విద్యాలయ వైభవాన్నీ, కీర్తిని, అలుపెరుగని సూర్యునితో అభివర్ణించారు. శాస్త్ర సాంకేతిక రంగాల కృషిని ఎత్తిచూపారు. సకల దేశాలలో ఈ విశ్వవిద్యాలయం, వెలుగుతున్న కవి భావన బాగుంది. **'ప్రకృతి పాఠం'** కవిత ద్వారా నూతన సంవత్సరాన్ని ఆహ్వానించిన సమ్మన్న కవిత్వాన్ని నేను ఆహ్వానిస్తున్నాను. రాబోయే కాలంలో కవితా వస్తువుతో పాటు వ్యక్తీకరణ శిల్పాన్ని మరింత పదునుపరుచుకుంటూ వచన కవిత్వంలో తనదైన ముద్ర వేయాలని నా భావన.

## ఆమె సూర్యోదయం కంటే ముందే

ఆమె
నీ కన్నా ముందే నిద్రలేస్తుంది
నీకున్న ఖరీదైన
అలారం పిలుపు తనకు లేకుంటేనేమి
బ్రాహ్మీ ముహూర్తంలో మేల్కొంటుంది.

యజమానురాలు ప్రమేయం లేకుండానే
ఇంటి గడపకు చక్కగా
పసుపు కుంకుమ రాసి
వాకిలికి చుక్కల ముగ్గులు పెట్టి
అరుణోదయ కిరణాల ఆగమనానికి
పెళ్లికూతురులా ముస్తాబు చేస్తుంది.

విరామం లేకుండా
సమయాన్ని పీరియళ్లుగా విభజించుకొని
అలసట ఎరగకుండా
ఒంట్లో బాగా లేకున్నా
ఇంట్లో ఉన్నంతసేపు
మనం చేయకూడదనుకున్న పనులను
పద్ధతి ప్రకారం శుభ్రం చేస్తుంది.

ఫ్రిజ్ లో పెట్టి ఇగం చేసినా
ఒవెన్లో దట్టించి వేడి చేసినా
ఇక మనకు వద్దనుకున్నది
ఏది ఇచ్చినా కాదనలేక తీసుకెళ్తుంది.

ఆ ఇంటి వాకిలి
బోల్లు బాసండ్లు
ఆమె చేతి ఆత్మీయ స్పర్శకు
తళతళ నవ్వుతాయి
ఆదరించేవారు
అనుభవించేవారు ఎవరో వాటికి
మనం చెప్పనక్కరలేదు.

వాళ్లు
దుమ్ము ధూళి
చెత్తాచెదారాన్ని
తొలగించడమే వృత్తిగా
స్వీకరించిన గొప్పమనస్కులు
చెత్త బండి వెనకాల
పోవడానికే ఇష్టపడని తలకాయలు మనవి
దేశాన్ని శుభ్రపరచడానికి
నిత్యం అశుభ్రపడతారు
ఎడమ చేతితో ఇస్తే
కుడి చేతితో తీసుకుంటారు
అర్ధరాత్రి నుండే వాడవాడలా
నగరం వీధుల తల దువ్వి
కంటి బూసులు తీసి ఆనందపడుతారు.

వేతనం హక్కుల కోసం
ఉద్యమించే అధికారులు బుద్ధి జీవులు
పని మనుషులను
మనుషులుగా గుర్తించడానికి
ఎప్పుడు వెనుకనే ఉంటారు.

రాజ్యానికి
నాలుగు రోజులు పాలకుడు లేకుంటెనేమి
పారిశుద్ధ్య పని మనుషులు
వారం రోజులు పని మానుకుంటే
అంతే సంగతులు !
జీవనోపాధి అనుకుంటారేమో ...
సమాజ సేవకు
బడుగు బలహీన వర్గాల చెయ్యి లేనిదే
దేశానికి
దేహానికి... చివరికి
దేవాలయానికి శుచి శుభ్రత
కల గనగలమా !!



-జిందమ్ అశోక్
8978532225

## నువ్వొక తోపు అంటూ రిసిప్ట్

మనిషి
స్క్రీన్ కాంతిలో
తన నీడనే మరిచిపోయాడు...
మోటివేషన్ అంటూ
మాటల మోత మోగిస్తూ
మనసుల్లో ఖాళీలను
నింపలేని వాణిజ్యం పెరిగింది...
ఒక క్లిక్ చేస్తే విజయం అంటారు
ఒక కోర్స్ తీస్తే భవిష్యత్ అంటారు
కానీ
ఒక అడుగు వేయాలంటే
మనసు మాత్రం ముందుకు రాదు...
డబ్బు కట్టిన రసీదు
ధైర్యానికి హామీ కాదు
సర్టిఫికేట్ తీసుకున్నా
సంకల్పం కొనలేం...
స్క్రీన్ మీద గొప్పగా చెప్పిన మాటలు
జీవితంలో నడవలేవు
అనుభవం తాకని జ్ఞానం
పుస్తకంలోనే మిగిలిపోతుంది...
పాత తరం చెప్పిన హితబోధ
చెవుల్లో కాదు,
జీవితంలో నాటుకుపోయేది
ఇప్పుడు మాత్రం
హెడ్ఫోన్స్ లో వినిపించి
హృదయంలోకి చేరడం లేదు...
బాధలే గురువులు
పోరాటాలే పాఠాలు
అవి ఫీజు అడగవు
కాని జీవితాన్ని నేర్పిస్తాయి...
మోటివేషన్ అంటూ
మాటల ముసుగులో
మార్కెట్ పెడుతున్న వారు
మన బలహీనతలపై
ధర ట్యాగ్ కడుతున్నారు...
జీవితం
డౌన్‌లోడ్ చేసుకునేది కాదు
అది దహించుకోవాల్సిన అగ్ని
అది అనుభవించాల్సిన ప్రయాణం...
స్క్రీన్ నుంచి లేచి
సత్యాన్ని తాకినప్పుడే
మనిషి నిజంగా
జీవించడం మొదలుపెడతాడు...



-ఎలగొండ రవి
9848770345

# కవుల మానసిక సంస్కారాల అంచనా 'విస్తార'

ఇప్పటికే సాహిత్య లోకంలో కవిగా, కథకునిగా తనదైన ముద్రతో ముందుకు సాగుతున్న ఎమ్వీ రామిరెడ్డి, ఇప్పుడు మరో ప్రక్రియతో మనల్ని పలకరించ బోతున్నారు. తమ ఫౌండేషన్ ద్వారా అటు సమాజసేవ చేస్తూ, తీరికలేని క్షణాలలో ఉంటూనే సాహిత్యాన్ని తనదైన దర్శనంతో చూస్తున్నారు. ఈ కవిత్వ వ్యాసాల ద్వారా వారి పఠనానుభవాన్ని మన హృదయానుభవంగా మారుస్తున్నారు. ఆయన వీటిని సహృదయంతో సమీక్షా వ్యాసాలు అన్నారు. కానీ ఇవి విమర్శనాత్మక వ్యాసాలు. విమర్శలో భేదాలకు సంబంధించి అభినందనాత్మక విమర్శ కూడా ఒకటి. ఈ వ్యాసాలలో వారు దాదాపు ఒక కవికి సంబంధించి ఒక కవితా సంపుటి లోని రచనలను విశ్లేషించారు. ఇట్లాంటి విశ్లేషణను వివరణాత్మక విమర్శ అని కూడా అనవచ్చు. ఆయా కవుల రచన తనకు ఎందుకు నచ్చింది?ఎలా నచ్చింది? అనే ప్రాతిపదిక మీద వారు ఈ వ్యాసాలు రాసినట్లుగా తెలుస్తోంది.

ఆయా కవుల రచనలలోని కళాత్మక విలువలు, అందులోని వస్తువు. వారి మార్గాలకు ఆయన వాహకంగా మారి, మనలోకి ప్రవేశిస్తున్నారు. కవుల కళాత్మక రూపాన్ని గురించిన ఆత్మల వ్యక్తీకరణగా ఈ వ్యాసాలను పరిగణించవచ్చు.

ఇందులో ఆయన ఎంచుకున్న 26 కవిత్వ సంపుటాలకు సంబంధించి వ్యాసాలు ఉన్నాయి. అయితే ఈ పుస్తకాలని ఏదో పైపైనే చదివేసి హడావుడిగా నాలుగు వాక్యాలు రాసేయ లేదు. పాఠకులను పక్కదోవ పట్టించే వ్యాఖ్యానాలు చేయలేదు. ఆ కవులు తనని మెచ్చుకోవాలనే కాంక్ష కనబడలేదు. వారి నుంచి తక్షణ లబ్ధి పొందాలని రాయలేదు.

ఆ 26 మంది వారి జీవితాల్లో నిమగ్నం అయి ఉన్నప్పుడు, అసలు వాళ్ళు ఎమ్వీ రామిరెడ్డి గురించి ఏ ఆలోచనా చేయని క్షణాల్లో ఆ కవుల పుస్తకాల్ని హత్తుకున్నారు. ఉత్తమమైన దానిగా భావించడం, నేర్చుకోవడం, ప్రచారం చేయడం విమర్శలో భాగమే. ఆయన ఈ వ్యాసాలలో ఎక్కడా తీర్పులు ఇవ్వ లేదు. అంచనా కట్టారు. నిర్ణయాత్మక విమర్శలో సిద్ధాంత ప్రతిపాదనలు లక్ష్యలక్షణ నిర్దేశాలు ఉంటాయి. ఈ వ్యాసాలలో ఆయన అట్లాంటి ప్రయత్నం చేయక పోయినా ఫార్మటివ్ అస్సెస్మెంట్ చేశారు.


యార్లగడ్డ రాఘవేంద్రరావు **"పచ్చికడుపు వాసన"** కవిత్వ సంపుటి పై ఆయన పరిశీలన చూడండి..

"రాఘవేంద్రరావు కవిత్వ శైలి తనకంటూ ప్రత్యేక ముద్రను సొంతం చేసుకుంది. ఆయన కవిత్వంలో సుదీర్ఘ వాక్యాలు ఉంటాయి. ఈ ధోరణిలో ప్రవాహ వేగం దెబ్బతినే అవకాశం ఉంది. కొనసాగింపు శ్రుతి తప్పే ప్రమాదం ఉంది. వాక్యాల మధ్య బంధం పెళుసుబారి, పాఠకుడు దారి తప్పే ప్రమాదమూ ఉంది. కానీ, యార్లగడ్డ కవిత్వంలో ఆ లోపాలు మచ్చుకైనా కనిపించవు. పైగా ఆ సుదీర్ఘ ధారే ఆయన కవిత్వానికి ట్రంప్ కార్డ్."

రామిరెడ్డి గారికి పాపినేని శివశంకర్ అంటే గొప్ప ఇష్టం. ఆయన కవిత్వం మీద రాసిన రెండు వ్యాసాలు ఇందులో ఉన్నాయి. ఆ రెండు వ్యాసాలలోను శివశంకర్‌ని భిన్నంగా జమ కట్టారు. **"రజనీ గంధ"**లో శివ శంకర్ తాత్త్విక పరిశోధన సుగంధం అయితే, **"లోయలూ శిఖరా లూ"**లో భూమి పుత్రుణ్ణి భుజాలపై మోసే కవిగా చూపుతున్నారు. తీసుకున్న వస్తువు ఏదైనా లోతుల్లోకి ఎలబారి దాని మూలాలను అందిపుచ్చుకొని అక్కడ కవితా నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు' అంటూ శివశంకర్ గారి కవిత్వ నిర్మాణ రహస్యాన్ని చెప్పారు. శివశంకర్ గారి కవిత్వంలో ముగింపులు మనల్ని వెంటాడ తాయని లోపల ఎక్కడో అగ్ని ముంటించి మనల్ని కూడా వెలిగి స్తాయని, ఆలోచింపచేస్తాయని ప్రకటిస్తారు.

రామిరెడ్డి మరో అభిమాన కవి శివారెడ్డి గారు. ఆయన మీద రాసిన రెండు వ్యాసాల్లోనూ విభిన్నత పాటించారు. **'Ode to Love అను ప్రేమగీతం"** కవితా సంపుటిలోని ప్రత్యేకతను ఇలా గమనించారు.

"శివారెడ్డి కవిత్వానికి, తాజా కంఠానికి స్పష్టమైన తేడా కనిపిస్తుంది. అత్యంత సాదాసీదా పదాలతో, వాక్యాలతో ప్రారంభ మయ్యే కవిత అంతే సరళంగా నడుస్తున్నట్లు కనిపిస్తుంది కానీ హఠాత్తుగా ఆ నడకలో ఒక అబ్బురపరిచే భంగిమ ప్రత్యక్షమ వుతుంది. ఊహించని వ్యక్తీకరణ మనకు ఊపిరాడకుండా చేస్తుంది. అందులోని నగ్నత్వం మనల్ని నిశ్చేష్టుల్ని చేస్తుంది. చుట్టుముట్టిన ఆలోచనల తుపాను లోంచి ఎట్లా బయటపడాలో అర్థంగాక అట్లా ఆ పేజీలోనే గడ్డకట్టుకు పోతాం. అసలు కవి త్వం చేయాల్సిన పని అదే కదా" అని గుర్తు చేస్తారు. శివారెడ్డి కవిత్వాన్ని **'అనంత కాలాల ఆత్మ జ్ఞానం'**గా వర్ణించటం మామూలు మాట కాదు. రామి రెడ్డి వచనం అద్భుతంగా ఉంటుంది. కవిత్వాన్ని విశ్లేషించే సందర్భంలో హఠాత్తుగా ఆయన లోంచి కూడా కవి తొంగి చూస్తాడు. ఆ మాటలు వ్యాసం నడకకు అడ్డు తగలకపోగా మనల్ని మరింత ముందుకు తీసుకెళ్తాయి.







ప్రతులకు:
ఫ్లాట్ నెం.ఎ-904
మొదటి ఫేస్,
రాంకీ గ్యాలక్సీ
నల్లగుండ్ల గ్రా,
హైదకాబాద్ 500 046
సెల్: 9866777870

**ఎమ్వీ రామిరెడ్డి రచించిన 'విస్తార' పుస్తకానికి డా॥ సుంకర గోపాల్ రాసిన ముందు మాట**

శివారెడ్డిగారి ఎత్తుగడ గురించి రామిరెడ్డి పరిశీలన చూడండి....

"రక్తపరీక్షలు... ఎక్స్‌రేలు.. స్కానింగ్‌లు గట్రా పూర్తి చేసి ఆనక తీరిగ్గా శస్త్రచికిత్స చేసే రకం గాదు ఈయన. ఎత్తుకోవటం ఎత్తుకోవటమే కత్తులు దూస్తాడు. ఆ ఎత్తుగడ ముందు ఎనస్తీషియా బలాదూర్. రపీమని ఓ మొట్టికాయ వేసి మనల్ని అమాంతం తనలోకి లాక్కెళ్ళారు. అక్షరాల సుడిలోకి ఈడ్చుకెళ్తాడు".

బండ్ల మాధవరావు గారి **"దృశ్య రహస్యాల వెనుక"** గురించి రాసిన వ్యాసంలో రామిరెడ్డి గారి శైలిని గమనించండి. వాక్యాన్ని ఎలా పరుగుపెట్టించాడో చూడండి..

"మాధవరావు కవిత్వం లలితంగా ఉంటుంది. సరళంగా సాగుతుంది. తేలికైన పదాల పొందికతో వాక్యాలు పరుగులు తీస్తాయి. లేగదూడల్లా గెంతు తాయి. కళ్ళంలో గింజల్లా రాలు తాయి. అట్లా అని ఆయన సంధించిన అక్షరం నంగిగా మూల గదు. విధేయంగా ఉండదు. వంగి వంగి నడవదు. నక్కి నక్కి చూడదు. ధీమాగా గొంతు విప్పుతుంది. ప్రశ్నిస్తుంది. గర్జిస్తుంది. నిటారుగా నడుస్తుంది."

×××

ఈ వ్యాసాలకు చదివించే గుణం అపారంగా ఉంది. రామి రెడ్డి గారికి భాష మీద పట్టు, నుడికారం మీద అధికారం పుష్కలంగా ఉన్నట్లు ఏ వ్యాసాన్ని చదివిన అట్లే అర్థమైపోతుంది. ఆయా కవుల కవితా సంపుటాలను విశ్లేషించే క్రమంలో వారు సమకాలీన అంశాల పట్ల, విచ్ఛిన్నమవుతున్న మానవ సంబంధాల పట్ల, జీవనమూలాల శైథిల్యం, సామాన్యుడి నైరాశ్యం, రాజకీయ అరాచకం, సంక్షోభాలు, ఆధునిక మానవ జీవనం మొదలైన వాటి గురించి తనదైన చూపుతో మాటాడారు.

**'లోపలి చీకట్ల రహస్యా న్వేషణ'**గా రవ వీరెల్లి **"కుం దాపన"**ను ఆవిష్కరించారు. "రవి ఎన్నుకున్న వస్తువుని తన కళ్ళల్లోకి, మనసులోకి పిండుకోవడంలోనే తన శక్తియుక్తులని పణంగా పెట్టాడని, సాధారణ అంశాన్ని అసాధారణ భావగాఢతతో కవిత్వంగా ఎలా మలచాలో రవి కవిత్వాన్ని సాక్ష్యంగా చూపాడు. ఈ కవి ఎంత చిక్కగా, లోతుగా, గంభీరంగా, అవసరమైతే సంక్లిష్టంగాను కవిత్వం రాయ గలడో అంతే తేలిగ్గా పదాల అల్లికతో అద్భుత అక్షరధార కురిపించ గల"డని చెప్తూ కవి వీరెల్లి లోని రెండు పార్శ్వాలను పట్టుకోగలిగారు.

విప్పగుంట రామ మనోహర **"అంతర్లోచనం' ఓ అంతర్లోక సంచలనం"** అంటూనే రామిరెడ్డి కవికి ఇచ్చిన నిర్వచనాన్ని చూడండి.

"కవి స్వప్నరూప శిల్పి. స్వప్న సహవాసి. స్వప్న సహపాఠి. కవి దృష్టిలో ప్రపంచం స్వప్నమంత విశాలం. స్వప్నం హృదయమంత విశాలం."

ఈ వ్యాసాలలో చాలాచోట్ల రామిరెడ్డి గారు కవిత్వ నిర్మాణానికి సంబంధించి స్పష్టమైన ప్రకటనలు చేశారు. ఒక కవిగా కవితని ఎలా నిర్మించాలో తనకు తెలుసు. దాన్ని ఆధారంగా చేసుకుని ఇతర కవుల నిర్మాణాల గురించి చాలా సులభంగా మదింపు చేశారు. ఇట్లాంటివి కొత్తగా కవిత్వం రాసే వాళ్ళకి, తమ కవిత్వంలో లోపాలను తెలుసుకోలేని వాళ్ళకి ఉపయోగపడతాయి.

అట్లాగే మువ్వా శ్రీనివాసరావు గారి వాక్యాంతాన్ని వాక్ ప్రవాహ పారవశ్యంగా వర్ణించారు. మువ్వా కవిత్వాన్ని ఎలా లోకంగా మలచుకున్నారో చెప్పారు. మువ్వా తన స్వర సమరం నిమిత్తం అక్షరాన్ని, వాక్యాన్ని, పద్యాన్ని, కవిత్వాన్ని ఆయుధంగా చేసుకున్నాడని, కవిత్వాన్ని విభిన్న భంగిమల్లో ప్రదర్శనకు పెట్టి కవిత్వ భాషలోనే తన భావ సముద్రాలను సృష్టించాడని, అతను అక్షర శస్త్రకారుడని చెప్పారు.

×××

వ్యాసాలకు ఆయన పెట్టిన శీర్షికల ద్వారానే ఆ సారాంశాన్ని చెప్పడం ఇందులోని ప్రత్యేకత. 'స్త్రీవాద తాత్త్వికతకు నీరాజనం' అంటూ మందరపు హైమవతి **"నీలి గోరింట"**ను, **'మూడో కంటిలో మెరిసిన కవన దృశ్యాలు'** అంటూ ఏనుగు నరసింహారెడ్డి **"నీడల దృశ్యాలు"** ను **"జనన మరణాల జాగృత జమానా'**గా ఏటూరు నాగేంద్ర రావు కవిత్వాన్ని, **'సాంకేతిక వనంలో సాహిత్య వసంతం'**గా కుడికాల వంశీధర్ నానీలను, **'లోతైన గాయాలకు ఘాటైన లేపనం'**గా శ్రీనివాస్ గౌడ కవిత్వాన్ని, **'మార్మిక కవిత్వ కరచాలనం'**గా పెరుగు రామకృష్ణ **"వరలిపి"**ని వర్ణించటం రామిరెడ్డి ప్రతిభకు నిదర్శనం.

ఈ వ్యాస సంపుటిలో పరిమాణంలో రెండు పెద్ద వ్యాసాలు ఉన్నాయి. **'ఈ తరానికి వరం కవితా ప్రవంతి'** అంటూ అరసం వెలువరించిన ప్రసిద్ధ కవుల సంకలనాల విశ్లేషణ. అలాగే **'కఠిన సుందర కవితా ప్రస్థాన మూర్తి'** అంటూ ప్రసాదమూర్తి కవిత్వం మీద అంచనా సుదీర్ఘంగా సాగిన వ్యాసాలు.

ప్రసాదమూర్తి గురించి ఎమ్వీ రామిరెడ్డి మదింపును చూడాల్సిందే.

"విషయపరంగా ప్రసాద మూర్తి, శ్రీశ్రీ, శివసాగర్, చెర బండ రాజు, శివారెడ్డి, నగ్న ముని, మద్దూరు నగేష్ బాబుల వారసత్వానికి చెందినవాడు. కవితాకళ పరంగా ఇస్మాయిల్, దేవిప్రియ, శిఖామణి, ఆశారాజు, స్కూలుకు చెందినవాడు" ఇట్లాంటి వ్యాఖ్యానాల దగ్గర రామిరెడ్డి గారి గడుసుదనం తెలుస్తుంది.

రామిరెడ్డి గారి కంటే కవిత్వంలో నాది చిన్న వయసు. నా దగ్గర ఇట్లాంటి ముందు మాట రాయించుకోవాలని వారికి అనిపించడవే నా అదృష్టంగా భావిస్తున్నాను.

ఈ అవకాశాన్ని చాలా గౌరవంగాను, ప్రశంసగాను భావిస్తున్నాను.

సృజనాత్మకంగా ఆలోచించడానికి అనుగుణంగా విమర్శ పాఠకుణ్ణి సిద్ధం చేస్తుంది. అయితే రామిరెడ్డి గారి సహృదయత ఆయా కవులలోని చిన్న చిన్న లోపాలను చెప్పడానికి అడ్డు వచ్చి ఉంటుంది. అందుకే ఆయన లోపాల జోలికి వెళ్లలేదు. ఇవాళ ఎవరు మన గురించి వ్యాసం రాస్తారా అని ఎదురు చూడటమే గాని, మనం ఎవరి గురించైనా రాద్దామా అని ఆలోచన లేని రోజులు. అట్లాంటి రోజుల్లో ఇట్లాంటి పని చేసిన రామిరెడ్డి గారు అభినందనీయులు.


ఈ కవిత్వ వ్యాసాలను చదవడం ద్వారా ఆ 26 పుస్తకాలను మాత్రమే గాక ఆయా కవుల అభివ్యక్తి, నిర్మాణం, శైలి ఆధారంగా మనం కూడా కొన్ని నిర్ధారణలు చేయగలం. ఈ వ్యాసాలు మనల్ని మరి ంత మెరుగుపరుస్తాయి అనడంలో ఎలాంటి సందేహం లేదు. అట్లా మెరుగుపరిచే క్షణాల్ని మనకు బహూకరిస్తున్న రామిరెడ్డి గారికి నిర్ణయాత్మక విమర్శలోకి మృదయపూర్వక స్వాగతం.

– డా॥ సుంకర గోపాల్


**కణిక**

సాహిత్యం, సామాజిక సేవ, విద్యారంగ వేదిక

## 'బుధవారం బాద్షా' నిర్వహిస్తున్న పోటీ ఫలితాలు







అడ్మిన్: రమాదేవి కులకర్ణి 8985613123

నిర్వహణ: శ్రీమతి సత్య నీలిమ

## నొప్పిని మోసే మంచితనం

సహాయం చేసిన చేతులు మరచిపోతారు త్వరలో.
కృతఘ్న హృదయాలు మాటల్లో ముసుగులు ధరిస్తాయి.
నమ్మకం మెల్లగా గాలిలో కలిసిపోయేలా చేస్తారు.
మనసులో మిగిలేది నిశ్శబ్దపు నొప్పే అవుతుంది.
పదేపదే జ్ఞాపకాలు లోపల గాయాలు త్రవ్వుతాయి.
అప్యాయత చూపినప్పుడే బాధలు పెరుగుతుంటాయి.
అర్థం చెప్పాలంటే మాటలకే శ్వాస మిగరదు.
ధైర్యం కూడా నెమ్మదిగా దారితప్పిపోతుంది.
మనసు ఇచ్చిన స్థలం నిశ్శబ్దంగా చెదిరిపోతుంది.
సహనం మాత్రమే అప్పుడు అండగా నిలుస్తుంది.
మోసం చేసిన వారి చూపులు చేదుతో నిండుతాయి.
గతం తలచుకుంటే హృదయం గుల్లై పోతుంది.
దూరం పెంచితేనే మనసుకు శాంతి చేరుతుంది.
తప్పు చేసినవారు తప్పులేని వేషమే వేస్తారు.
నమ్మి ఇచ్చిన విశ్వాసమే గాయాల్ని మోస్తుంది.
కన్నీళ్లు రాకపోయినా మనసు బాధపడుతూనే ఉంటుంది.
పగటి నవ్వు రాత్రికి మెల్లగా మౌనమవుతుంది"
నిజమైన విలువను కాలం మాత్రమే నేర్పుతుంది.
మోసపోయినా మనసు మంచితనం వదలదు అసలు.
తుదకు మనకే మనమే అండగా నిలవాల్సి వస్తుంది.

**-రాజకుమారి,** హైదరాబాద

## నవ ఉషోదయపు వెలుగు కై...

నలిగిపోతున్నా మగువగా బాధ్యతల బంధాలతో,
నవ్వు వెనకాల దాచుకున్న నిశ్శబ్ద గాయాలతో.
నలిగిపోతున్నా అమ్మగా బిడ్డలకు రెక్కలొచ్చి,
ఎగిరిపోతున్న వేళ వారిని విడిచిపెట్టలేక.
నలిగిపోతున్నా విద్యార్థిగా చదువుల ఒత్తిడితో,
మనసులోని భయాలను బయటకు చెప్పలేక.
నలిగిపోతున్నా గృహిణిగా ఇంటి పనుల భారంతో,
అలసిన శరీరానికి విశ్రాంతి దొరకక.
నలిగిపోతున్నా ఉద్యోగినిగా కాలపు పరుగులో,
కుటుంబం, కార్యాలయం మధ్య నన్నే కోల్పోతూ.
నలిగిపోతున్నా కూతురిగా తల్లిదండ్రుల ఆశలతో,
వారి కన్నీటి వెనుక నా కలలను దాచుకుంటూ.
నలిగిపోతున్నా భార్యగా అర్థం కాని మాటలతో,
మనసు ముక్కలైనా మౌనంగా నిలబడుతూ.
నలిగిపోతున్నా సమాజపు తీర్పుల రాళ్లతో,
ప్రతి అడుగునా నన్ను నేనే నిరూపించుకుంటూ.
నలిగిపోతున్నా? అయినా బాధ్యతలు
వీడటానికి మనసురాక
ఎందుకంటే మగువ హృదయం బాధలోనూ
వెలుగునే పంచుతుంది.

**-రాజ్యలక్ష్మి శశిధర్.**

## మధ్య తరగతి మందహాసం

ఆలోచనలన్నీ కొట్టుకుంటున్నాయి ఒడ్డున పడ్డ చేపల్లా...
మనసు కునారిల్లుతోంది పంజరంలో
బందీ అయిన చిలుకలా...
నలిగి పోతోంది హృదయం వలలో చిక్కిన జింకలా...
అనుకున్నవి తీరే దారి దొరకక..
ఊహలు నిజం అయ్యే తావు లేక...
గుండె మారుతోంది ఇస్త్రీ చేయని గుడ్డలా...
సమస్యలు విష వలయంలా చుట్టు ముడుతుంటే...
తీరని బాధ్యతల భారం
నెత్తిన గుదిబండలా మారుతుంటే...
నలిగిపోతున్నా జీవితం ఆశనిరాశల కత్తెరలో
పోకచెక్కలా అవుతుంటే...
గంతకు తగ్గ బొంతలా దొరికిన ఉద్యోగం చేస్తుంటే..
చాలీ చాలని జీతం నెలంతా భయపెడుతుంటే...
నలిగిపోతున్నా ఆదాయవ్యయాల వ్యత్యాసం
అప్పుల ఊబిలో లాగుతుంటే
నమ్ముకున్న వారికి కడుపు నింపలేని దురవస్థకి...
దరిద్రం తుమ్మబంకలా అతుకున్న నా పరిస్థితికి...
నలిగిపోతున్నా చిన్న కోరికలు తీర్చలేని నా దుస్థితికి..
నలిగిపోతూనేవున్నా అనుక్షణం
జీవితంలో సాధించిందేంటో తెలవక...
వాస్తవాస్తవాల మధ్య నలిగిపోతూనే వున్నా
మిక్సీలో పచ్చడిలా....
కనిపిస్తూనే వున్నా మధ్యతరగతి మందహాసంలా...

**-జి. మధు మురళి.** భీమారం

## మనో విలాపం

రోజు రోజుకి పెరిగిపోతున్న ధరలు
ఎక్కడివక్కడే కూర్చున్న ఆదాయాలు
మనిషికి పెరిగిపోతున్న గొంతెమ్మ కోరికలు.
ధనిక వర్గానికి నిచ్చెన వెయ్యలేక
పేద వర్గానికి దిగజారలేక...
మధ్యతరగతి మనిషిగా నలిగి పోతున్నా
వివరించలేనిది నా మనో విలాపం
దానిని వర్ణించడానికి చాలదు ఏ కాయితం.
విద్యారంగం వ్యాపార ధోరణిలో సాగుతుంటే
కన్నబిడ్డలకు సరైన విద్యను అందించలేక
కుటుంబాన్ని సంతృప్తిగా పోషించలేక
ఆర్థికభారం మోయలేక....
అడుగడుగునా కష్టాల కంటకాలు
మనసుకు గాయాలు చేస్తుంటే....
ఏమని చెప్పను నా మనో విలాపం....
ఆదాయం కంటే కట్టే పన్నులభారం
పెరిగిపోతుంటే...
దిక్కుతోచని సగటు మధ్యతరగతి
మనిషిగా తరుణోపాయం కోసం చూస్తున్నా....!
ఆశల వాకిట నిలబడి
మడమ తిప్పక నాకు నేనే
కొత్త ఊపిరి పోసుకుంటూ....
అందరికీ విద్య.. అందరికీ ఆహారం
అందుబాటులోకి రావాలని ఆశిస్తూ....!!

**-లక్ష్మీ పద్మజ దుగ్గరాజు,** హైదరాబాద్



సాహితీరంగంలో నిలువెత్తు తెలుగు సంతకం...

# శ్రీమతి శారదా అశోకవర్ధన్

నివాళి




సాహితీరంగంలో నిలువెత్తు తెలుగు సంతకం...బహుముఖీన ప్రతిభకు ప్రత్యక్ష సాక్ష్యంగా నిలచిన 'శ్రీమతి శారదా అశోకవర్ధన్' ఇక లేరు. ఆవిడ విరమణతో తెలుగు సాహిత్యంలో ఒక సుదీర్ఘ అధ్యాయం పూర్తయింది...తెలుగు కళామతల్లి ప్రస్థానంలో ఒక సువర్ణ శకం ముగిసింది.

87ఏళ్ల తన జీవన ప్రస్థానంలో గృహిణిగా, ప్రభుత్వ అధికారిగా, సాహితీవేత్తగా, మానవతావాదిగా, స్ఫూర్తి దాయినిగా... ఒకటేమిటి- ఒక మహిళ నిర్వర్తించగలిగే వైవిధ్యభరితమైన అన్ని కోణా లలో తన ప్రతిభను సమర్థవం తంగా నిర్వర్తించి, సంపూర్ణ విజయం సాధించి భావితరాలకు తమ స్మృతినే 'స్ఫూర్తి'గా మిగిల్చి నిష్క్రమించిన అత్యంత అరుదైన మహిళలలో శారదా అశోకవర్ధన్ ఒకరు. ఇలాంటి మహనీయ మూర్తుల 'జీవన విరమణ'ను "మరణం" అనే పదం కంటే "మహాభినిష్క్రమణం" అనే పదంతో పేర్కొనడమే సబబు.

సాహితీ జగత్తులో ఒక ధ్రువతార నేలకొరిగినప్పుడు- ఆ 'శూన్యం' కేవలం అక్షరానికి మాత్రమే కాదు... ఆ అక్షరాన్ని శ్వాసించే కోట్లాది హృదయాలకు కూడా కలుగుతుంది. ఒక 'లెజెండ్' అనదగిన మహిళా సాహితీమూర్తి నిష్క్రమణ అంటే- ఒక గ్రంథాలయం కాలిపోవడం కాదు... ఒక తరం 'సామాజిక స్పృహ' తన గొంతుకను కోల్పోవడం.

శ్రీమతి శారదా అశోకవర్ధన్ ఇకపై భౌతికంగా మన మధ్య ఉండక పోవచ్చు- కానీ ఆమె కలం జాలువార్చిన సిరాచుక్కలు ఇంకా ఆరలేదు. ఆ ఆర్ద్రతతో, ఆ జ్ఞాపకాల పరిమళంతో ఆమెకు అర్పించే ఒక విభిన్నమైన 'అక్షర నివాళి' ఇది.

. . .

సాధారణంగా ఒక రచయిత్రి మరణించినప్పుడు ఆమె రాసిన పుస్తకాలు, అందుకున్న అవార్డులు, చేసిన ప్రసంగాల గురించి మాట్లాడుకుంటాం. కానీ, శారదగారి 'నిష్క్రమణ'... అక్షరం తనకుండే 'అమ్మతనం' కోల్పోవడం లాంటిది. ఆమె రాసిన ప్రతి వాక్యం వెనుక ఒక సామాజిక యుద్ధం ఉంది, ప్రతి పదం వెనుక ఒక ఆర్ద్రమైన కన్నీటి చుక్క ఉంది.

87ఏళ్ల తన జీవన ప్రస్థానంలో శారదగారు సాహిత్యంలోని అన్ని ప్రక్రియలలోనూ కలిపి 82 గ్రంథాలు వెలువరించినా... అవి కేవలం ఊసుకోలు కబురులో, ఉబుసుపోక రాసినవో కాదు- సమాజాన్ని ఎలా చూడాలో, ఎలా చదవాలో, సమాజం నుంచి ఏమి స్వీకరించాలో నేర్పించేవి. 'స్త్రీ' అంటే కేవలం ఇంటి నాలుగు గోడల మధ్య నలిగిపోయే అస్తిత్వం కాదని, ఆమె ఒక చేత్తో ఊయల ఊపుతూనే మరో చేత్తో ప్రపంచ గమనాన్ని మార్చగల 'శక్తి స్వరూపిణి' అని తన సాహిత్యం ద్వారా నిరూపించిన ధీశాలి... శారదా అశోకవర్ధన్.

ఆమె సాహితీ ప్రస్థానం ఒక నిశ్శబ్ద విప్లవం. అప్పట్లో సాహిత్యం అంటే కేవలం వర్ణనలు, అలంకారాల చుట్టూ తిరుగుతున్న కాలంలో, ఆమె పచ్చి నిజాలను పలకడం మొదలుపెట్టింది. మధ్యతరగతి మహిళల వేదనను, అణ గారిన వర్గాల ఆవేదనను ఆమె తన కలం ద్వారా ప్రపంచానికి వినిపించింది.

చాలామంది రచయితలు బాహ్య ప్రపంచాన్ని వర్ణిస్తే... ఆమె మనుషుల అంతరంగంలోకి వెళ్లి, అక్కడ దాగివున్న గాయాలకు అక్షరాలతో చికిత్స చేసింది. ఆమె కథలు చదువుతుంటే- అవి ఎక్కడో జరిగిన విషయాలుగా కాకుండా మన ఇంట్లోనో, మన పక్కింట్లోనో జరుగుతున్నట్టుగా ఉండేవి. ఆ 'అనుసంధాన'మే (కనెక్టివిటీ) శారదగారిని సాహిత్యంలో ఒక 'లెజెండ్'గా నిలబెట్టింది.

ఆమెను చాలామంది ఏదో ఒక వాదానికి పరిమితం చేయాలని చూశారు. కానీ ఆమె పరిధి అంతకంటే చాలా పెద్దది, మరెంతో విశాలమైనది. ఆమె స్త్రీల గురించి రాసినా... అందులో సార్వజనీనమైన 'మానవత్వం' ఉండేది. తన రచనల ద్వారా పురుషాహంకారాన్ని ప్రశ్నించేటప్పుడు, పురుషాధిపత్యాన్ని నిరసించేటప్పుడు కూడా ఆయా రచనల్లో పురుషుల పట్ల ద్వేషం వెల్లడయ్యేది కాదు, ఒక సంస్కరణాభిలాష వ్యక్తమయ్యేది.

"కలం పట్టింది కేవలం కాగితం మీద గీతలు గీయడానికి కాదు... సమాజం మీద పడ్డ మచ్చలను తుడవడానికి!" అని ఆమె తరచూ అనేవారు. ఆ మాటకు ఆమె చివరిశ్వాస వరకు కట్టుబడి ఉన్నారు.

ఆమె సృష్టించిన పాత్రలు- అవి గృహిణులు కావచ్చు, శ్రామికులు కావచ్చు, విద్యావంతులు కావచ్చు... అన్నీ కూడా ఆత్మగౌరవానికి ప్రతిరూపాలు. ఓటమిని అంగీకరించని మొండితనం, ఆపదలో ఉన్నవారికి అండగా నిలిచే గుణం... ఆమె పాత్రల్లో స్పష్టంగా కనిపించేవి, ఆమె నిత్యజీవితంలో అనుసరించేవి, ఆవిడ ఆచరణలోనూ అగుపించేవి. నిజానికి ఆ పాత్రలన్నీ ఆవిడ ప్రతిబింబాలే.

గొప్ప సాహిత్యం ఎప్పుడూ గొప్ప వేదన నుండే పుడుతుంది. ఆమె ప్రపంచానికి నవ్వులను, ఆలోచనలను పంచడంతో పాటు తన వ్యక్తిగత జీవితంలోని సంఘర్షణలను తన సాహిత్యానికి ఇంధనంగా మార్చుకోవడం జరిగింది.

ఆమె దగ్గరకు వెళ్లిన ఎవరికైనా ఒక విషయం స్పష్టంగా అర్థమవుతుంది- ఆమె అక్షరానికి ఉన్నంత గంభీరత, సూటిదనం, కరకుదనం ఆమె వ్యక్తిత్వంలో, నైజంలో ఉండేది కాదని! ఆమె ఒక పసిపాప అంత అమాయకురాలు, ఒక మాతృమూర్తి అంతటి ప్రేమమయి. కొత్తగా రాసే యువ రచయితలను ఆవిడ ప్రోత్సహించిన తీరు, వారికి అందించిన సూచనలు ఈరోజు ఎందరో రచయితలను, నావంటి ప్రచురణ కర్తలను తయారుచేశాయి. ఆమె ఒక వ్యక్తి కాదు... నిరంతర స్ఫూర్తి, ప్రోత్సాహాలను అందించి 'మంచి మనుషులు'గా తీర్చిదిద్ది సమాజానికి అందించే ఒక సామూహిక శక్తి, ఓ సమగ్ర సంస్థ.

. . .

శారదగారి భౌతికకాయం ఇప్పుడు అగ్నిలో కాలిపోయినా, పంచభూతాలలో కలసిపోయినా... ఆవిడ రాసిన ప్రతి అక్షరం ఒక్కొక్క విత్తనమై నేలంతా వ్యాపించివుంది.

సాహితీ ప్రపంచంలో ఒక నక్షత్రం రాలిపోయింది. కానీ ఆ నక్షత్రం వెదజల్లిన వెలుగు ఇంకా మన దారులను ప్రకాశింపజేస్తూనే ఉంది. ఆమె లేని లోటుని ఏ పుస్తకమూ భర్తీ చేయలేదు, ఏ పురస్కారమూ ఆమె స్థాయిని కొలవలేదు.

ఆవిడ వెళ్తూ వెళ్తూ తన భావాలనూ, భావనలనూ, ఆలోచనలనూ మనకు మిగిల్చి వెళ్లింది. ఆమెను మనం నిజంగా స్మరించుకోవాలంటే... ఆమె రాసిన పుస్తకాలను చదవడం మాత్రమే కాదు- ఆమె ఏ ఆశయాల కోసమైతే తన జీవితాన్ని సాహిత్యానికి అంకితం చేసి 'అక్షర యజ్ఞం' చేసిందో... ఆ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి, ఆచరణతో వాటిని సఫలం చేయాలి.

"క్షరం కానిదే... అక్షరం!
అక్షరానికి మరణం లేదు... దానిని సృష్టించిన సృష్టికర్తకు మరణం రాదు."

శారదగారు భౌతికంగా విశ్రమించినా... మన గుండె చప్పుళ్ళలో, మనం చదివే ప్రతిపేజీలో ఆమె 'ఊపిరి' వినిపిస్తూనే ఉంటుంది, ఆవిడ అందించిన 'స్ఫూర్తి' కనిపిస్తూనే ఉంటుంది.

శారదగారి ప్రయాణం ముగియలేదు... మన ఆలోచనల్లో కొత్తగా మొదలైంది.
ఒక ధీరవనితకు, అక్షరదేవతకు
ఇవే నా అశ్రునివాళులు.



**-యస్వీకృష్ణ** 93999 39302

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాయి. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాయి. కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి; మెరుగు పరచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా 1779వ రోజు 'బొగ్గుగని' అనే అంశంపై పలువురు కవులు తమ కవితలను పంచుకున్నారు. కవితల సాధన చేస్తున్న కవులందరికీ అభినందనలు. 'బొగ్గుగని' అంశంపై వచ్చిన కొన్ని కవితలను 'నేటి నిజం' పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం.

-సంపాదకులు

**మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక & దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సమూహం**

అడ్మిన్ & ఏకాంశ కవిత్వ నిర్వహణ:
**-డా॥రాయారావు సూర్యప్రకాశ్‌రావు,** 9441046839



## చెమట చుక్కలు

నిత్యం బొగ్గు వెలికితీత శ్రమ యజ్ఞం
చెమటలో బొగ్గు నుసి రాసుకున్నాకే
గని కార్మికుల గానంతో
నల్ల వజ్రం సూరీడికి శనార్తులు.
ఎన్ని చెమట చుక్కలు జీవిడిసాయో!
ఎందరు సైరన్ మోత వినలేక
జ్ఞాపకాల ప్రమిదలయ్యారో!!
కార్మికన్నలకు వందనాలు.
నేల పొరల్లోంచి
యంత్రాలతో యంత్రాలై
ఏతమేసే పని
బొగ్గు గని కార్మికుల
ఉత్పాదక సామర్థ్యం.
గతకాలపు పింజర లో
దిగిన రోజుల్నుంచి
పని మార్పుల
పరిశోధనల ఫలితాలు నేటి వరకూ
ఓపెన్ కాస్ట్ లతో
బొగ్గు గనుల తవ్వకాలకు శ్రీకారం.
నాణేనికి ఒకవైపు
అభివృద్ధి ఆనవాళ్ళు
మరోవైపు
పర్యావరణ విధ్వంస రాకాసి లోయలు.
సయోధ్యకు సమరశంఖం పూరిస్తేనే
నేటి- రేపటి తరాలకు
వెన్నెల్లో జాజి పూల దారి.
బొగ్గు గనులకు అనుసంధానం
విద్యుదుత్పత్తి కేంద్రాలు
తవ్విన బొగ్గు లోయలోకి
మళ్ళీ విద్యుత్ సంస్థల
బూడిద నీటిని
జీరో ప్రమాదాల ప్రమాణాలు పాటిస్తూ
మూతపడిన బొగ్గు గనులను నింపితేనే
పర్యావరణ ముక్తికి శక్తి చాలకం.
నేలమ్మ అడుగడుగునా
మహా రత్నగర్భ
కోరుకున్నవి ఏరుకుంటూ
కోయిల పాట పాడాలి.
ఖనిజ సంపదను తీసుకుంటూ
సూర్య తాపాన్ని తగ్గించే
చలువ పందిళ్ళేసే చెట్లను పెంచాలి.
యాజమాన్యం ప్రభుత
పర్యావరణానికి గొడుగు పట్టాలి
ఉపాధికి స్థానికతను జోడించి
ఉద్యోగ కల్పవృక్షమై నిలవాలి.

**-ఏడెల్లి రాములు**

## క్రాంతి ధ్వని!!

నేల తల్లి గర్భంలో
దాగిన నల్లని కాంతికిరణం
బొగ్గుగని మానవావరణానికి
శక్తి నిచ్చే ఆభరణం!.
కార్మికజీవుల నిత్యాన్వేషణ ఫలాలు
జాతికి అత్యంత ప్రాధాన్యమైన
స్వేదబిందువులతో
సాకారమైన ధవళవిద్యుత్కాంతికి
మరోవైపునుండీ సాగించే
తిమిరకూపాల తవ్వకాలు!.
యముని లోహపు ఘంటల ధ్వని
మార్చలేదు
ఈ శ్రామికుల సమరోత్సాహాన్ని!
ప్రాణవాయువు అందని
ప్రమాదకరచోటు
క్షణమాత్రపు ఏమరుపాటైనా
పైనున్న పెళ్ళలు
లాక్కుపోయే ప్రాణాలు!
ప్రతినిత్యం దినదినగండం

## చీకటి గర్భంలో ?

కాలం తన కడుపులో దాచుకున్న
దహనమైన ఎన్నో చెట్ల చరిత్ర
జ్ఞాపకమే బొగ్గుగని.
పాతాళంలో పాతిపెట్టిన
పచ్చని తరువుల
వెచ్చని గడ్డకట్టిన
నల్లరక్తమే బొగ్గుగని.
కన్ను పొడిచినా
కానరాని చీకటిలో
గని గొంతులోకి పనికోసం
పాకుతూ వెళ్తున్నప్పుడు
ఊహల్లో వినిపించే
పిల్లల నవ్వులను వింటూ
ఊపిరిలో దూరిన
బొగ్గుదూళిని భరిస్తూ
తలపై కబళించటానికి సిద్ధంగా ఉన్న
రాతిరూపపు మరణాన్ని దాటుకుంటూ
మనిషి తన కడుపుకోసం
భూమాత గర్భాన్ని
గాయపరచే యజ్ఞం చేస్తాడు.
ఆ చేతులు
నల్లని బొగ్గుని మాత్రమే తవ్వవు
పాతిపెట్టిన సమానత్వాన్ని వెతుకుతూ
చెల్లని చరిత్రను వెలికితీస్తాయి.
ముసురు పట్టిన
నలుపు మేఘం వర్షించినట్టు
కారే కార్మికుడి
ప్రతి చెమటచుక్కలో
ఊపిరాడని

చెరసాల జీవితం ప్రతిఫలిస్తుంది.
తెరలు తెరలుగా
తన్నుకొచ్చే దగ్గు
దేశ ఆర్థిక విధానాలు నిర్దాక్షిణ్యంగా
కార్మికుల జీవితాలపై
రక్తంతో చేసిన సంతకం.
గని బెల్టులపై
గరగరలాడే బొగ్గుముక్కలు
రైళ్లెక్కిపోయి
నగరాలకు వెలుగులను పంచుతాయి.
గనివాడి ఇంటి పొయ్యి మాత్రం
చీకటినే చిక్కగా కాల్చుకుంటుంది.
తెలంగాణ మట్టిగడ్డపై సింగరేణి
కొందరి ఊపిరి మెడపై వేలాడే కత్తి.
సైరన్ మోత వినిపించిన ప్రతిసారి
ఆత్మీయుల గుండెల్లో
భయం విత్తనం మొలుస్తుంది.
"తిరిగి వస్తాడా? రాడా?" అనే ప్రశ్న
శబ్దంలేని పిడుగై కాలుస్తుంది.
గని బావి నోట్లో జరిగిన
ఎన్నో నరబలుల ప్రతిఫలమే
మనం వాడే విద్యుత్తు.
నల్లని వారి బ్రతుకులు రగిల్చిన
నిప్పుల వెలుగులే
మన సౌకర్యాల వెచ్చదనం.
చీకటి గురించి తెలుసుకున్నవారే
వెలుగును అత్యంత ప్రేమిస్తారు.
పరికించి చూస్తే....
నల్లబంగారం లాభాల పట్టికలపై
ఎందరో వితంతువుల
కన్నీటి చారికలు కనిపిస్తాయి.

అందుకే...
మన ఇళ్లలో వెలిగే ప్రతి బల్బు
గనికార్మికుడి చెమటతోనే
ఒక తల్లి ఆందోళనతోనే
ఒక కుటుంబం త్యాగంతోనే.
గుర్తుంచుకో-
ప్రకృతి వనరులను భాధ్యతగా వాడటం
ప్రతి ఒక్కరి కనీస కర్తవ్యం.

**-నాగరాజు చందూరి**

## వజ్రసమమైన నల్ల బంగారం

అవని మాత ఒడిలో దాగిన
వెలుగు పూల మూలలను
పదిలపరుచుకున్న
వజ్రసమమైన నల్లబంగారం.
నాగరికత నడకలలో
మానవాళికి మహోన్నతమైన
చేయూతనిచ్చిన కార్మిక చెమట
చుక్కల చెలిమి గీతం.
కాలరీస్ కార్మికులు కష్ట జీవులు
భూమి పొరలలో బతుకులీడుస్తూ
రోజుకో తడవ పునర్జన్మ ఎత్తుతూ
భూదేవి ఒడిలోకి వెళ్ళివస్తుంటారు.
గుహలలాంటి సీములలో
మానువల్ పద్ధతితో మొదలయ్యి
మెకానికల్ పద్ధతిలోకి మారి
పెద్ద ఎత్తున ఉత్పత్తిని చేస్తూ
ఓపెన్ కాస్ట్ పద్ధతికి మారుతున్నది.
కష్టాల కడలిలో కలుషిత వాతావరణంలో
నిత్యం దుమ్ము ధూళితో.
పోరాడుతూ
చిరుదీపంతో చీకటిని చీల్చుకుంటూ
జాతి వెలుగులకోసం
జతకట్టి నడిచే లక్షల కార్మికులు.
మారుతున్న ప్రపంచంలో
కాలుష్యం లేని సోలారును
గాలిమరలనుప్రోత్సహించి
గండాలను గట్టెక్కించాలి.

**-నగునూరి రాజన్న**

## బొగ్గుగని గుండెల్లో వెలుగు

భూమి గర్భంలో నిద్రించిన రహస్యాల గుహ
నిశ్శబ్దం పలికే బొగ్గుగని లోకమిది మహా
చీకటిలో చిమ్మిన చెమట చుక్కల కథలు
కష్టజీవుల హృదయాల్లో వెలిగే ఆశల దీపాలు.
తెలంగాణా నేల పిలిచే కర్మభూమి గానం
బొగ్గుగని గుండెల్లో వెలిగే జీవన ధ్యానం
కష్టాల నడుమ పెరిగిన ఆశల కొలువు
ప్రజల పలుకుల్లో వినిపించే గని వెలుగు.
గనిలో అడుగేసిన ప్రతి అడుగు ఒక గీత
గుండెల్లో ధైర్యం, కళ్లలో వెలుగు ధార
రాళ్ల మధ్య దాగిన నల్ల బంగారు వెలుగు
దేశం నడిపే శక్తిగా మారే
మౌన మధురపు పలుకు.
పగలు రాత్రి తెలియని కష్టాల సవ్వడి
జీవితం గెలిచే యోధులది ఈ గని గాధ
చీకటిని చీల్చే చిన్న దీపపు జ్యోతి
మనిషి సహనానికి అది నిలిచే ప్రతీకృతి.
చీకటి లోయలలో చెమటతో రాసిన గాథ
పొగమంచులోనూ నిలిచే మనసుల దీప్తి పథం
బొగ్గు కణాల్లో మెరిసే జీవన జ్యోతి
తెలంగాణా గుండెల్లో నిత్యం వెలుగు నూతి.
బొగ్గు కణాల్లో దాగిన శ్రమజీవుల స్వప్నం
అవి వెలిగించె ప్రపంచానికే నూతన దివ్యం
గనిలో మగ్గిన గుండెల కథలు వినిపించగా
మనసు స్పందన
గౌరవంతో, కృతజ్ఞతల రాగంగా.
కొలువు కోసం కష్టపడే కూలీల కథలు
వారి అడుగుల్లో దేశానికి వెలుగుల మార్గాలు
గనిలో గడిచే ప్రతి క్షణం ఒక యజ్ఞం
ప్రతి ఊపిరిలో వినిపించే శ్రమ గీతం.
పల్లెల నుంచి పట్నాల వరకూ ఆశల జాడ
బొగ్గుగని తెచ్చే జీవనానికి కొత్త నాడి
బొగ్గుగని కేవలం చీకటి కాదు సఖీ
అది వెలుగునిచ్చే జీవన గాథ, మానవ శక్తి!.
తెలంగాణా ప్రజల కొలువు ఈ గని ప్రాణం
వెలుగునిచ్చే శక్తిగా నిలిచే నిత్య ధ్యానం
బొగ్గుగని గుండెల్లో వెలుగు
మానవ జీవితంలో గెలుపు.

**-గుండవరం కొండల్ రావు**

నూరేళ్లాయుస్సు...
సమిష్టి కృషికి
సంకల్పమే శ్రీరామరక్ష!.
మసిబారిన శ్రామిక వదనాలలో
విసుగులేని
విలక్షణమైన ఉపాధిరంగంలో
ప్రతీ ఉదయం ఓ అస్తమయరాగం
ప్రతీ నిశీధిలో ఆశా అరుణవర్ణం!!
నుదుటికి ధరించిన కాంతిబుడ్డి
జాతీయ అభివృద్ధికోసం
తపనపడే తీరిది!!
దహనశీల శిలాజ ఇంధనానికై
సహనశీలుర బలాబలాల
ప్రదర్శనా మందిరమిదే!!
గని కార్మికులకు
అభినందనచందనాలు!!.

**-ఎం.వి. ఉమాదేవి**

## సైనికులే!

ఆర్థికాభివృద్ధిలో
ఉపాధి కల్పనలో
కీలకపాత్ర సింగరేణిది
నూట ముప్పైయారేళ్ల చరిత్ర
కొట్లాది టన్నుల బొగ్గు వెలికితీత
విద్యుదుత్పత్తికి ప్రధాన వనరైన ఇంధనం
బయోచార్ ద్వారా మేలైన
అధిక వ్యవసాయ ఉత్పత్తులు
జీవ బొగ్గు ఎరువు
గాలిలో కార్బన్ డై ఆక్సైడ్ ను తగ్గిస్తుంది
సిద్ధ వైద్యంలో బొగ్గుపొడి
వివిధ పదార్థాల సమ్మేళనం
అనేక వ్యాధులకు పరిష్కారం
తెలిసినవారికి నల్ల బంగారం
తెలియనివారికి వంట ఇంధనం
బొగ్గు విలువ ఎంతో
తెలంగాణ వ్యాప్త సేవలు
సగం తెలంగాణ విస్తరణ
ఇల్లందు, భద్రాచలం
గోదావరిఖని
మణుగూరు, కొత్తగూడెం
పాల్వంచ, భూపాలపల్లి
బొగ్గు గనులలో భూమి లోపలికి
కిలోమీటర్ల దూరం వెళ్లే క్రమం
తలను కప్పి ఉంచే ప్రత్యేక హెల్మెట్లు
కాళ్ళకు బూట్లు
చేతిలో లాంతరు
తవ్వడానికో ఆయుధం
ఎంత జాగ్రత్తగా ఉన్నా
ఒక్కొక్కసారి
బొగ్గు గోడలు కూలిపడి గాయాలు
మరణించనూ వచ్చు
అందుకే
గని కార్మికులూ
ప్రాణాలొడ్డే సైనికులే!.

**-నాగిరెడ్డి అరుణ జ్యోతి**

## నలుపులో నిగ్గు

పూడ్చిపెట్టిన సూర్య రశ్మి
కొన్నప్పుడు నలుపు
వాడితే ఎరుపు
పారేస్తే తెలుపులో
త్రిమూర్తిస్వరూపం
బొగ్గును పాలతో
కడిగితే రంగుపోదు
మార్చలేని పాలకే సిగ్గు
నలుపు కన్నా
బొగ్గు ఉపకారం మిన్న.
నేలతల్లి గుండెపొరల్లో
లక్షలాది ఏళ్లుగా వృక్షావశేషాలు
నిగనిగ నల్లబంగారంగా
మనిషిచేతిలో ఇంధన అవసరాలు
విద్యుదుత్పాదనలో కొత్త లోకాలు.
బొగ్గుగని తవ్వకంలో నీరు చేరితే
ఆక్సిజన్ అందక ప్రాణాలు హరీ
కానీ వారిని తలిచేవారేరీ!?
సింగరేణిలో వందకోట్ల
కోల్ వాషర్లతో
బంకర్లదాకా రవాణా.
కోల్ ఇండియా
తీరుస్తుంది దేశావసరాలు
నైనీలో ఒక టన్నుబొగ్గుకి
రెండు టన్నుల
మట్టితీస్తే చాలు
నాణ్యతకై పెరుగుతున్న పోటీ.
బయోచార్‌తో
పంటలకు లాభం
ఖర్చు తక్కువ
దిగుబడి ఎక్కువ.
బడుగు శ్రామికులు
ప్రాణాలు పణంగా పెట్టి
గనుల లోకి చొచ్చుకుపోయి
తవ్వే బొగ్గుపొరలు
వారికి మృత్యుద్వారాలు!
సరైన వసతులు కల్పించని
యజమానులకు
కొత్త బంగారు లోకాలు.

**-ఎ.రాజ్యశ్రీ**



తెలంగాణ రచయితల సంఘం జంట నగరాల శాఖ ప్రతి వారం 'జూమ్'లో నిర్వహిస్తున్న "సోమవారం కవిసమ్మేళనం - కవివారం'లో కవులు పాల్గొని చదివిన కొన్నికవితలను నేటినిజం పాఠకుల కోసం..

నిర్వహణ
-కందుకూరి శ్రీరాములు
-బెల్లంకొండ సంపత్ కుమార్

## అమ్మ

సృష్టి అంటే నే అమ్మ
సృష్టి దేవత అమ్మ
దైవం కనిపిస్తుందో లేదో
కనిపించే దైవం అమ్మ
అమ్మ అంటే ఓ ఆరాటం
నేర్పుతుంది జీవిత పోరాటం
అమ్మ అంటే ఓ బంధం
అల్లుతుంది తీయని అనుబంధం
అమ్మ అంటే ఓ అండ
చేస్తుంది ఏమి జరగకుండా
అమ్మను చూసుకో మరవకుండా
ముసలుకో మనసు విరగకుండా
అమ్మ ప్రేమ
వెన్న మీగడల పాలకుండ
కాపాడుకో చేయి జారకుండా
జారితే ఉంటుందా పగలకుండా
అమ్మతోనే ఉండు వదలకుండా
దొరుకుతుందా జన్మలెత్తకుండా!
అమ్మ ప్రేమ జగతికి
అమృతమంత అండ దండ
నిత్యం స్మరించు మరవకుండా
నీ జన్మ సార్థకం చేస్తుంది అమ్మ!
(మాతృ దినోత్సవం సందర్భంగా)

-పట్లొళ్ళబక్కారెడ్డి
9705315250

## తోలు బొమ్మ

తోలు బొమ్మలం మనం
మనం నవ్వితే ఆడించే దేవుడు
బ్రహ్మాండమంతగా నవ్వుతాడు
మనం ఏడ్చినా
దేవుడు సర్వజ్ఞంగా నవ్వుతాడు!
ఆయనకేం ఏడ్పు!.
తోలు బొమ్మలను చేసి ఆడించే
దేవుడిని ఎన్నో ప్రశ్నలు
ప్రశ్నోపనిషత్తుగా అడగాలని
ఉంటుంది మనకు-
అందుకే కనిపించడు!!
గారడి వాడు కదా-
కనిపిస్తే ఖేల్ ఖతం !!.
దృశ్యం మారింది
తోలుబొమ్మ మనిషే
ఇపుడు దేవుడిని ఆడిస్తున్నాడు
మరి రాయిని చేసి
గంధం పూసి
హుండీ పెట్టి
రథంకు కట్టి
జాతరగా ఆడిస్తున్నాడు
ప్రసాదాలు తింటున్నాడు!!

-కందాళై రాఘవాచార్య
87905 93638

## కప్పు చెప్పిన పాఠం

చేతిలోని చాయ్ కప్పు చేజారి
నేలను తాకి పగిలింది
అప్పుడు అర్థమైందొకటి
మన నోటి నుండి పొల్లుమాట జారితే కూడా
పక్కవారి మనసు ముక్కలవుతుందని
దాన్ని అతికించడం అసాధ్యమని
తీయని పలుకులతో
ఎంత అతుకుపెట్టినా అతకదని
కదులుతున్న కాలంలో
కోపం గాజు ముక్కై
చివరి శ్వాస దాకా గుచ్చుతుందని
ఈ గాయానికి మందే లేదని
పగిలిన మనసు కనిపిస్తే పలుకు రాదని
క్షమించమనడానికి నాలుక తిరగదని
నిజంగానే నాకు అర్థమైంది
అందుకే కప్పైనా, నోరైనా జాగ్రత్తగా పట్టుకోవాలి
జారే ప్రతి మాటను పెదవి అడ్డుగోడపై
ఓ క్షణం ఆపి ఆలోచించాలి
లేకపోతే కప్పు ముక్కలవుతుంది
మనసు ముక్కలవుతుంది

– కుమ్మరి అక్షయ

## పుస్తక పరిమళం

తోటలో పూసిన పువ్వుల పరిమళం
కొన్ని గంటలు మాత్రమే ఉంటుంది
కానీ పుస్తక పరిమళం
ఎప్పటికి? వీడని శాశ్వత నేస్తం
ఈ పుస్తకాల పేజీలని
ఒక్కసారి తిరిగేసి చూడు!
దాంట్లో నుంచి వచ్చే ఆ కాగితాల వాసన
ఏ సెంటు సీసా కూడా ఇవ్వలేని అద్భుత పరిమళం
ఈ రోజు ఉన్న స్నేహితుడు
రేపు నిన్ను వదిలేయవచ్చు
కానీ పుస్తకం మాత్రం ఎప్పటికి నీ నీడలా
నిలుస్తుంది
డబ్బులను దొంగలిస్తారేమో
కానీ పుస్తకం ఇచ్చే జ్ఞానాన్ని ఎవరు దోచుకోలేరు
చీకటిలో ఒక దీపం వెలుగునిస్తుంది
కానీ జీవితపు చీకటిలో
ఒక మంచి పుస్తకం దారి చూపిస్తుంది
మనం పుస్తకం పేజీలు తిప్పితే చాలు
ఏ ఖర్చు లేకుండా
ప్రపంచం మొత్తం చూపే నేస్తం పుస్తకం
అందుకే మిత్రమా ఫోన్ మాయలో పడి
నిజమైన పరిమళాన్ని మర్చిపోకు
రోజుకు ఒక పేజీ అయినా చదివు
అక్షరాల తోటలో ఒక్కసారి హాయిగా తిరిగి చూడూ
దానికే బానిసైపోతావు
నీ ఆలోచనల సరిహద్దులను పెంచుకో...
నీ జీవితాన్ని సువాసనభరితంగా చేసుకో!

– ఎమ్.పూజిత

## ఎండ కాలం

ఉదయం లేవడంతోనే సూర్యుడు నిప్పులు
కురిపిస్తున్నాడు
అమ్మ కోపంతో కళ్ళు ఎర్రజేసినట్లుగా
ఆకాశం సూర్యుడి కాంతిలో మండిపోతుంది
రోడ్లన్నీ ఎడారి ఇసుక తివాచీలా మారాయి.
మండుతున్న ఈ ఎండలు
సూర్యుడి కోప్పాన్ని తలపిస్తూ
శత్రువుల్లా ఉంటే
పండిన మామిడి పళ్ళు తీపిని పంచుతున్నాయి
కరిగిపోతూ కుల్ఫీ కారినట్టు
చెమటలు కారుతూనే ఉన్నాయి.
అయినా సరే ఈ ఎండాకాలంలో
ఒక ఆనందం ఉంది
ఊరగాయ పచ్చళ్ల ఘుమఘుమలు,
కొబ్బరి బోండాలు,రాగి జావ,
మామిడి పానకం
ఈ కాలపు అనుభూతులు.
ఎండిపోయిన చెరువులు
నష్టపోయిన జీవాన్ని చూపిస్తుంటే
వేపపువ్వులు సువాసనలను
కొత్త వసంతాన్ని తెస్తున్నాయి
పగటి పూట భానుడి ఉగ్రరూపం కురిపిస్తే
రాత్రి పూట మేడపైన ముచ్చట్లు చల్లబరుస్తాయి
కాలం ఎలా మారినా
ప్రకృతి ఇచ్చే రుచులు,ఆటలు
మనస్సును ఆనందమయం చేస్తాయి
ఎది ఏమైనా ఎంత ఎండలు ఉన్నా
వచ్చే మంచి కాలం కోసం
ఈ కష్టాలన్నీ భరిస్తాం

-ఎమ్.సాయి కృతిక

## సెలవులు సెలవు తీసుకుంటే బాగుండు

మనసంతా తెలియని శూన్యం
ఏదో కోల్పోతున్నానన్న బాధ
ఒకప్పుడు ఎండకాలం సెలవులొస్తున్నాయంటే
ఎగిరి గంతేసేదానిని
కాని ఇప్పుడు ఆ కాలం వస్తుందన్న ఊహే
ఊహించని బాధని తెచ్చిపెడుతుంది.
ప్రతీసారి వేసవికాలం ఎప్పుడొస్తుందోనని
పాఠశాలకి సెలవులను తెచ్చిపెడుతుందోనని
ఆత్రుతతో అవధులు లేని
ఉత్సాహంతో ఎదురుచూసేదానిని
కాని ఇప్పుడేమో బడికి
సెలవులొస్తున్నాయంటేనే దుఃఖమొస్తుంది
ఇకముందు మా అందరిని
తమ సొంత పిల్లల్లా ఆదరించిన గురువులను
వదిలి వెళ్ళాలన్న నిజం
విషం కంటే వంద రెట్లు చేదుగా ఉంది
అమ్మ కడుపులో నేను తొమ్మిది నెలలే ఉన్నా
కాని మా బడిలో పది సంవత్సరాలు
చిన్నపిల్లలాగే ఓ అమ్మ ఒడిలో ఉన్నట్లు
మా పాఠశాల ఒడిలో ఒదిగా కాని ఇప్పుడు
ఈ వేసవి కాలం సెలవులతో
పది సంవత్సరాల అనుబంధం తెగిపోతుంది
ఇంక ఈ బాధని చెప్పడానికి
ఏ మాటా లేదు నా దగ్గర!
వేసవి సెలవులు వస్తే
ఇంతకుముందున్న ఇకపకలేవీ ఉండవు
మొన్నటి దాక స్నేహితులతో పెట్టిన ముచ్చట
వేసవి మంటల్లో కాలిపోతుంది
ప్రతి సంవత్సరం ఎంతో ఆనందాన్ని మిగిల్చిన
సెలవులు
ఈసారి మాత్రం మమ్మల్ని
పాఠశాలనుండి శాశ్వతంగా దూరం చేస్తాయి
ఈ సెలవులు సెలవు తీసుకుంటే
బాగుండనిపిస్తుంది

– పద్మ భవ్యశ్రీ

## ఉత్పత్తులకు ఊపిరి పోస్తరు

భావ్య ప్రపంచానికి కనిపించేదంత
సుందరం! సౌందర్యమే
మెరిసే మెరుపులు
కంటిపాపలనే మురిపిస్తయి.
అంతర్లోకంలో అడుగులుపెడితే
లోహపు ఊడలు
కాళ్లకు చుట్టుకుంటాయి
ఊపిరి బుగ్గలకు శ్వాస అందక
ముడుచుకుంటాయి.
ఇరుకిరుకు యంత్రఅమరికలు
గాలిలో విన్యాసాలాడే
కాలుష్యపు పొగ మబ్బులు
నవనాడులను ఉద్రేకపరిచే
రసాయన ఆవిర్లు.
దేహాలనావహించి
కనిపించని కత్తుల లెక్క
మెత్తగ గొంతులను కోస్తవి
కంటిచూపుకు పొర తెరలు పూస్తవి.
కండరాలలోకి చొచ్చుకొని
వొణుకుడు పుట్టిస్తవి
కంటినిండ కునుకుపట్టనివ్వక
జీవన్మర సంకటస్థితికిచేరుస్తవి.
ప్రాణవాయువుని మింగేసే క్లోరిన్
క్లోరైడ్ నైట్రోజన్ వాయువులు
ప్రాణం లేని క్షార ఆమ్లముల
ఘాడతలు ఆవిరి రూపంలో
నిగనిగలాడే దేహాలను
పొడుచుకు తింటాయి.
కోటానుకోట్ల జీవ సంరక్షణలో
అనారోగ్య పీడితులను
విముక్తి పరుచుటకు
ప్రాణాలకు తెగిస్తారు.
కొందరు శ్రమ దీరులు
ఆరోగ్యమైన దేశం కోసం
తాము అనారోగ్య పీడితులుగ
జీవితాలను త్యజిస్తారు
కనిపించని
విద్యుత్ ప్రవాహకాల లెక్క
నిశ్శబ్దంగ యంత్రాలను నడుపుతు
ఉత్పత్తులకు రూపమిస్తు
ఊపిరి పోస్తరు.

-యరకల యాదయ్య.
9866468979


## మౌనముద్రలో న్యాయదేవత

లింగ భేదాల మధ్య
బలహీనతలో
అరిటాకు
నలిగిపోతూనే ఉంటుంది
కాలం రాసిన చరిత్ర ఇది
ఎప్పుడూ ఒకటే తీరు
వల పన్నడం వేటగానికి సరదా
చిక్కడం చేపకు రివాజే!.
అవినీతిని గంపకింద దాచే
అధికారపు తోలుకు
మందమెక్కువ
ఓట్లేసి ఎన్నుకున్ననాడే
దోచుకునే అధికారం కూడా
చేతిలో పెట్టినట్టేమో!
కాపాడాల్సిన పాలకులే
అన్యాయాలకు కాపుకాస్తారు.
హోరెత్తే న్యాయస్థానాలిప్పుడు
బిక్కమొకాలు వేస్తాయి
పాలనా ప్రతినిధుల
కుతంత్రయుక్తుల నడుమ
ధర్మ సంకటపు త్రాసులో
తాను చూడలేని నిజాన్ని
న్యాయదేవత
మౌనంతో కప్పుకుంటుంది
చట్టాన్ని శాసించి
చేతులు మారిన నోట్లకట్టలు
శీలాన్ని
బజారున నిలుపుతాయి.
నిన్నకు, నేటికీ
జరిగిన పోరాటంలో ఓడి
చిరిగిన జీవితానికి
పచ్చి నెత్తురు గాయం
శాపమై వెంటాడుతుంది.
బలం, బలగంతో
అంతే అహంకారాన్ని కప్పుకొని
బోయవాడు తిరిగొస్తాడు
వేటకు చిక్కిన ప్రాణికి
రేపన్నది శూన్యంలో
కరిగిపోతుంది

-ధూళిపాళ అరుణ

# మహిళల యాత్రా కథనాల ఆవిష్కరణ మరియు పరిచయ సభ

హైదరాబాద్, మే 20(నేటినిజం ప్రతినిధి)తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో, హైదరాబాద్ విమెన్ రైటర్స్ ఫోరం నిర్వహణలో మహిళల యాత్రా కథనాల ఆవిష్కరణ మరియు పరిచయ సభ ఈనెల 17న ఆదివారం సాయంత్రం 6 గంటలకు రవీంద్ర భారతి కాన్ఫరెన్స్ హాలులో భండారు విజయ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా శాంతిశ్రీ బెనర్జీ ట్రావెలాగ్ 'హైద్రాబాద్ టు షీకాగో'' ను ప్రముఖ రచయిత, మాజీ చైర్మన్, తొలి తెలంగాణ బి. సి. కమిషన్, బి. ఎస్. రాములు గారు ఆవిష్కరించగా, ప్రముఖ కవయిత్రి, రచయిత్రి మోర్తాల విమల గారు పరిచయం చేశారు. శాంతిశ్రీ రెండవ ట్రావెలాగ్ 'గమనకాంక్ష' ను ప్రముఖ అనువాదకులు, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత జె. ఎల్. రెడ్డి గారు ఆవిష్కరించగా, ప్రముఖ కవయిత్రి, రచయిత్రి శీలా సుభద్రా దేవి గారు పరిచయం చేశారు. గిరిజా పైడిమర్రి గారి ట్రావెలాగ్ 'గిరిగమనం' ను ప్రముఖ కవయిత్రి, రచయిత్రి గీతాంజలి గారు పరిచయం చేశారు. వక్తలు తమ తమ యాత్రానుభవాలను పంచుకొనడమే కాకుండా పుస్తకాలను ఆసక్తికరంగా పరిచయం చేశారు.



పుస్తకావిష్కరణలో బండారు విజయ, బి.యస్.రాములు, శీలా సుభద్రా దేవి, గిరిజా పైడిమర్రి, గీతాంజలి తదితరులు

# మహాత్మా జ్యోతీబా ఫులే గారికి తెలుగు వారి చేయూత మరువలేము-కపిల్ పాటిల్

హైదరాబాద్, మే 20(నేటినిజం ప్రతినిధి)మే 11న "రాష్ట్ర పితామహులు మహాత్మా జ్యోతీరావ్ ఫులే జన్మ ద్విశతాబ్ది మహోత్సవ్ సమితి" ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సభలో సమితి అధ్యక్షులు కపిల్ పాటిల్ మాట్లాడుతూ, జ్యోతిబా ఫులే స్థాపించిన "సత్య శోధక్ సమాజ్" కు తెలుగు వారు ఎంతో సాయం చేశారని కొనియాడారు. 1874 లో ఫులే గారి ముంబయి యాత్ర సందర్భంగా ఆర్థికంగా హార్దికంగా సాయ పడటమే కాక, సత్యశోధక్ సమాజ్ లో మూడవ వంతు సభ్యులు తెలుగువారే ఉండిరన్నారు. తేది 1888వ సం॥లో జ్యోతీరావ్ ఫులే గారికి "మహాత్మా" బిరుదును ఇచ్చి 138 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా స్థానిక రవీంద్ర నాట్య మందిర్ లో ఏర్పాటు చేసిన సభలో బహుజన సమాజానికి చెందిన నగర ప్రముఖులను సన్మానించారు.

మూల్ నివాసి మాల గారి చొరవతో వివిధ వృత్తి కులాలకు చెందిన మన తెలుగు వారు సర్వశ్రీ నడిమెట్ల ఎల్లప్ప, రణవేణి లక్ష్మణ్, జూకంటి రాంచందర్, వంగల కృష్ణ, మందపెల్లి లక్ష్మణ్, తడ్కపెల్లి నరేష్, కేదాస్, వడ్డి సూర్యనారాయణ, నేలపూడి శరత్,బి. రాంప్రసాద్ ముదిరాజ్, సామల లక్ష్మణ్ గార్లను ప్రమాణ పత్రాలతో సన్మానించారు. జ్యేష్ట తెలుగు రచయిత, కవి డా. అంబల్ల జనార్దన్ గారిని, ఫులే గారికి ప్రత్యేకమైన శిరస్త్రాణంతో సన్మానించారు. కార్యక్రమంలో మ్హాత్రే గారి నేతృత్వంలో స్ఫూర్తి దాయకమైన పాటలు పాడి ప్రేక్షకులను ఉర్రూత లూగించారు. ఆ సందర్భంగా కపిల్ పాటిల్ గారు రాసిన "రాష్ట్ర పితామహ మహాత్మా జ్యోతీరావ్ ఫులే" పుస్తకాన్ని ఆవిష్కరించారు.



'మహాత్మా జ్యోతిబాపూలే" పురస్కార గ్రహితలు.

# ఆన్‌లైన్ మందుల మాఫియాపై సమరం

విజయవాడ, మే 20: కార్పొరేట్ శక్తుల దోపిడీ,ఆన్‌లైన్ మందుల అక్రమ దందా నుండి ప్రజారోగ్యాన్ని,లక్షలాది మంది సంప్రదాయ ఔషధ వ్యాపారుల జీవనోపాధిని కాపాడుకోవడానికే కృష్ణా జిల్లా వ్యాప్తంగా ల్యాకౌట్ నిరసన చేపట్టామని,ఈ బంద్ వంద శాతం విజయవంతమైందని ది కృష్ణా డిస్ట్రిక్ట్ హోల్‌సేల్ డ్రగ్ ట్రేడ్ అసోసియేషన్ అధ్యక్షుడు సి.సి. కేశవరావు, కార్యదర్శి వి. మురళీకృష్ణ(కొండపల్లి బుజ్జి ), కోశాధికారి జి. సురేష్ స్పష్టం చేశారు.

ఐఓసీడ్ పిలుపులో భాగంగా జరిగిన ఈ నిరసనను ఉద్దేశించి వారు మాట్లాడుతూ,ప్రాణాధారమైన ఔషధ రంగాన్ని ఆన్‌లైన్ వ్యాపార మాఫియాకు ధారాదత్తం చేస్తూ, చట్టవిరుద్ధంగా సాగుతున్న ఈ-ఫార్మసీల విక్రయాలను ప్రభుత్వం తక్షణమే నిషేధించాలని డిమాండ్ చేశారు.నిబంధనలను తుంగలో తొక్కుతూ కార్పొరేట్ సంస్థలు ఇస్తున్న అడ్డగోలు డిస్కౌంట్లు, కేవలం చిన్న వ్యాపారులను మార్కెట్ నుండి తుడిచిపెట్టే కుట్రలో భాగమేనని వారు మండిపడ్డారు.

నాణ్యతా ప్రమాణాలు లేని, నకిలీ, నిషిద్ధ మందులను ఆన్‌లైన్ ద్వారా విక్రయిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న శక్తులపై ప్రభుత్వం జీఎస్ఆర్ 220 నిబంధనల ప్రకారం క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేవలం లాభాపేక్షతో రోగుల జీవితాలను ఫణంగా పెడుతున్న ఆన్‌లైన్ విధానాన్ని అరికట్టకపోతే, రాబోయే రోజుల్లో ఔషధ సరఫరాలను పూర్తిగా నిలిపివేసి దేశవ్యాప్తంగా మెడికల్ ఎమర్జెన్సీ తరహాలో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని అసోసియేషన్ నాయకత్వం ప్రభుత్వాన్ని తీవ్రంగా హెచ్చరించింది.

# ఛార్లీ ఛాప్లిన్‌తో మేం!

ఇదేదో టైం ట్రావెలింగ్ మిషన్ ఎక్కి నిన్నటిలోకి ప్రయాణం చేసి ఛాప్లిన్‌ని కలుసుకోవటం కాదు. మా అన్య ఇటీవల జరుగుతున్న పరిణామాలు చూసి కలత చెందుతున్న విషయం మీకు తెలుసు. అలాంటివన్నీ నిరంతరాయంగా జరుగుతుం టాయి. ముందు మా అన్యను ఆ మూడ్ నుండి బయటకు తీసుకురావాలి. దానినే 'ఎలియనేషన్' అంటారంట.

సినిమాల్లో కూడా ఓ విషాద దృశ్యం పతాక స్థాయికి చేరినప్పుడు ప్రేక్షకులను తిరిగి మామూలు స్థితికి తీసుకురావటానికి ఓ కామెడీ సీన్ వేస్తారు అని ఓ పెద్దాయన చెప్పాడు. ప్రేక్షకులు గాని, మనుషులు గాని ఎప్పుడూ ఒకే రకమైన మానసిక స్థితిలో వుండటం వలన అనేక ప్రమాదాలు కూడా వుంటా యంటారు.

ఇప్పుడు సెలవులు వచ్చాయి. మేము చేయవలసిన, రాయవలసిన అంశాలు, పనులు చాలా వున్నాయి. అందుకని విదూ, నేను ఛాప్లిన్ సినిమాలు అన్యతో కలిసి చూసే కార్యక్రమం పెట్టుకున్నాం.

అవి చాలా వున్నాయి. మన హీరోలు, ఇతర నటీనటులు ఇన్ని వేషాలు వేశారు, వేస్తుంటారు కదా! మరి ఛాప్లిన్ ఎన్ని పదుల పాత్రలు వేసినా అదే టోపి, అదే కోటు, చేతిలో ఓ స్టిక్కు, చిత్రమైన నడక. ఇవే కదా కోట్లాదిమందిని ఊపేసింది.

మన పాటలు చూద్దాం. చలం గారు అన్నట్లు హీరో, హీరోయిన్లు పాటలు పాడాలనుకుంటారు. అది మాలాంటి పిల్లల కల కావచ్చు, వారి డ్రీమ్ సాంగ్ కావచ్చు. చివరికి మన దర్శకులు ఏ లెవెల్‌కి చేరుకున్నారంటే 'మనం ఓ పాటేసుకుం దామా' అంటారు. ఏ స్టూడియోలోనో, ఏ సెట్టింగ్‌ల మధ్యనో వాళ్ళే ఎనౌన్స్ చేస్తారు. వెనకాల వందలమంది మందలు మందలు గా కాస్ట్యూమ్స్‌తో వస్తారు. చరణం చరణంకి డ్రెస్‌లు మారతాయి.

ముందు గీత రచయిత రెడీ. తర్వాత సంగీత దర్శకుడు, నృత్య దర్శకులు, కెమెరామెన్‌లు, ఇలా వందలమంది ప్రత్యక్షంగా, పరోక్షంగా తయారయి పోతారు. సినిమా అంటే వినోదమేగా. మిమ్మల్ని నవ్వించాలి, కవ్వించాలి. అన్ని రసాలు అనుభవించేలా చేయాలి. ఇందులో లాజిక్కులు వెతకొద్దు అంటారు. నిజానికి ఒక్కో పాట ఖర్చుతో ఒక్కో సినిమా తీయవచ్చు. సినిమాల్లో ఇంకో అంశం కూడా వుంది.

పాటల తర్వాత మాటలు. ఇక్కడ బోల్డంత మంది మాటల మాంత్రికులు వున్నారు. ఈ మాటకు అన్య అభ్యంతరం చెప్పింది.

"మాంత్రికులు ఏంటి మేంగో! నాకు బాలనాగమ్మలో, పాతాళభైరవి సినిమాల్లో మాంత్రికులు గుర్తు వస్తారు. ఇలాంటి




బిరుదులు వారికి అలంకారమా? అవమానమా?" అని తిరగబడింది.

"అదేంటి అన్యా! మనం చందమామ కథలు చదివాం కదా. అందులో మంచి దెయ్యాలు-భూతాలు-రాక్షసులుంటారు కదా. అలాగే మంచి మాటల మాంత్రికుల న్నమాట" అన్నాను.

"నువ్వు ఎన్నన్నా చెప్పు మేంగో. నాకు అలాంటి పదాలు ఇష్టం వుండదు. అలాగే మాంత్రికురాళ్ళు వుంటారు. అసలా బొమ్మలు చూస్తేనే నాకు చీదరగా వుంటుంది" అంది అన్య.

"ఓకే. ఇది ప్రజాస్వామ్యం. నీ అభిప్రాయాలు నీవి. ఇక్కడ ఎవరి భావాలు వారివి. ఎవరి థీరీలు వారివి. అదే కదా డెమోక్రసీ లోని బ్యూటీ" అన్నాను.

"సరే? బీస్ట్‌లోనూ మీరు బ్యూటీ చూస్తానంటే మీ ఇష్టం. అసలు ఛాప్లిన్ మాటలు లేకుండానే చాలామందిని నవ్వించాడు కదా!" అంది. "అవును. ఒకప్పుడు మూకీలే వున్నాయి. తర్వాత కదా టాకీలు వచ్చాయి. ఈ రెండు రకాల సినిమాలు ఛాప్లిన్ తీశాడు. సిటీ లైట్స్, మోడ్రన్ టైమ్స్, ది గ్రేట్ డిక్టేటర్ లాంటి సినిమాలు మేం చూశాం. హాయిగా నవ్వుకున్నాం. ఒక్కోచోట కన్నీళ్ళు వచ్చాయి. ఇంకోచోట ఆవేశం వచ్చింది. గ్రేట్ డిక్టేటర్ సినిమా చూస్తుంటే ట్రంపు గుర్తొచ్చాడు అదీ విషయం" విదు అన్నాడు.

"ఆ తాతని గ్రేట్ డిక్టేటర్ అనకు. ఫేక్ డిక్టేటర్" అంది అన్య.

"హర్మూజ్ జలసంధిని మూయటం, తెరవటం, సగం మూయటం ఇవన్నీ మనకు ప్రస్తుతం బంద్. ఇంతకీ ఛాప్లిన్‌లో ఏం నచ్చింది మీ ఇద్దరికీ" అన్నాను.

"దానికంటే ముందు మన సినిమావాళ్ళు అప్పటినుంచి ఇప్పటివరకు అలాగే ఇకముందూ ఛాప్లిన్‌ని కాపీ కొడుతున్నారు కదా. వారు ఆయన నుండి ఏం నేర్చుకున్నారు? అది ముందు తేల్చండి" అంది అన్య.

"ఎవరు ఒంగున్నా వారి ముడ్డి మీద తన్నటం" అన్నాడు విదు.

నేనూ, విదూ బిగ్గరగా నవ్వాం. అన్య పెదవులు కదిలీ కదలనట్లు నవ్వింది. ఓ రెండు దశాబ్దాల పాటు మన సినిమాల్లో కామెడీ అంటే ముడ్డి మీద తన్నటం, చెంపలు వాయించటమే కదా!

"నిజానికి ఛాప్లిన్ తన్నింది మనుషుల ందర్నీ. మీ దరిద్రపు భావాల్నీ, అలవాట్లని భరించలేకపోతున్నాం. ఈసారి ముడ్ల మీద కాదు గుండెల మీద తంతారు అని హెచ్చరిక అది" అంది అన్య."కొంతమంది ఛాప్లిన్‌నీ తన్నారు" అన్నాడు విదు.

"అంటే ఛాప్లిన్ తన మీద తనే జోకులు వేసుకున్నాడు. ప్రతి యాక్షన్‌కి రియాక్షన్ వుంటుంది. గాంధీతాత ఈ చెంప మీద కొడితే ఆ చెంప చూపించమన్నారు. ఇప్పుడు అలాంటిది కష్టం" అన్నాను.

ఏమైనా మేం ఛాప్లిన్ సినిమాలను ఎంజాయ్ చేశాం. ఆయన జీవిత కథను చదువుకున్నాం. మా ఛానల్‌లో మా అన్యతో ఛాప్లిన్ మీద ఓ ప్రసంగం ఏర్పాటు చేయాలనుకున్నాం.

అప్పుడు మాకు ఓ పెద్దాయన కలిశారు. వారి మాటల్తో ముగిస్తాను.

"పిల్లలూ, నదులు వున్నాయి. ప్రకృతి వుంది. ఎవరు ఏది కావాలనుకుంటే అది వాటినుండి తీసుకోవచ్చు. ఛాప్లిన్‌ని ప్రేరణగా తీసుకుని అద్భుతా లు సృష్టించిన వారున్నారు. వ్యక్తులు, పురాణాలు, ఇతిహాసాలు, మత గ్రంథాలు ఇన్ని వున్నాయి.

దాన్నుండి మీరు ఏం నేర్చుకుంటారనేది వ్యక్తిగతం.

అది మీ మనసులో వుంటే ఫర్వాలేదు. ప్రవచించటం మొదలుపెడితే ప్రతి యాక్షనుకూ రియాక్షన్ వుంటుంది.'

– పి.చంద్రశేఖర అజాద్
92465 73575

## చురక

అధికారులు ఎందరో
అవినీతిలో తిరుగుతారు
కోట్లకొద్ది లంచాలతో
కొండలలై పెరుగుతారు
దండిగానే ఏసీబీ
దర్యాప్తుల దండోరా
ఐనా కూడా ఆఫీసుల్లో
అవినీతేల నిండారా



-వేల్పుల నారాయణ
9440433475

## రాధశ్రీ రాగాలు

కవులలో జాబిల్లి
కవితలో సిరిమల్లి
ఘనుడు దేవులపల్లి
అనును రాధశ్రీ !!
ముందు దారికి భద్ర
ముగ వేసె రసముద్ర
శోధకుం డారుద్ర
అనును రాధశ్రీ



-రాధశ్రీ
సెల్:9494481210

# విద్యాసంస్థల వాహనాల యాజమాన్యాలు నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు : రవాణా శాఖ

హైదరాబాద్, మే 20: రాష్ట్రంలో పాఠశాలలు , విద్యాసంస్థలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకొని ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు రవాణా శాఖ అధికారులు వెల్లడించారు. విద్యార్థులను రవాణా చేసే అన్ని విద్యాసంస్థల బస్సులు , ఇతర వాహనాలు తప్పని సరిగా ఫిట్‌నెస్ సర్టిఫికేట్ కలిగి ఉండాలని స్పష్టం చేశారు.

ఫిట్‌నెస్ లేని వాహనాలు, అధిక సంఖ్యలో విద్యార్థులను ఎక్కించుకొని నడుపుతున్న వాహనాలు, భద్రతా ప్రమాణాలు పాటించని వాహనాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహనాలకు చెల్లుబాటు అయ్యే ఫిట్‌నెస్ సర్టిఫికేట్, పర్మిట్, ఇన్సూరెన్స్, కాలుష్య నియంత్రణ సర్టిఫికేట్ కచ్చితంగా ఉండాలని సూచించారు. వాహనాలలో అనుమతించిన సామర్థ్యానికి మించి విద్యార్థులను తరలిస్తే చర్యలు తీసుకుం టామన్నారు. డ్రైవర్లకుడ్రైవింగ్ లైసెన్స్ , అనుభవం , ఫస్ట్ ఎయిడ్ బాక్స్, ఫైర్ ఎక్సిటిం గ్విషర్, ఎమర్జెన్సీ ఎగ్జిట్ వంటి భద్రతా సౌకర్యాలు, విద్యార్థుల భద్రత కోసం అటెండర్‌ను నియమించాలన్నారు. ఫిట్‌నెస్ లేకుండా నడుస్తున్న వాహనాలు లేదా ఓవర్‌లోడ్ చేస్తున్న వాహనాలను వెంటనే సీజ్ చేస్తామన్నారు. అధిక సంఖ్యలో విద్యార్థులను ఎక్కించుకునే వాహనాలలో తమ పిల్లలను పంపవద్దని తల్లిదండ్రులకు రవాణా శాఖ సూచించింది.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar,Hyderabad-500020. Telangana.
'Editor: BAISA DEVADAS.
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com